

₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్


సంపుటి- 8 సంచిక - 19

పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2017


## ఈ తరం వినూత్న ఉద్యమం
## ఈ సురాజ్య యాత్ర : జేపీ

Enrol at:
www.youthforbetterindia.com
www.citizensforbetterindia.com



"Our lives begin to end
the day we become silent
about things that matter."
- Martin Luther King Jr

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

అక్టోబర్ 1-15, 2017 సంపుటి - 8 సంచిక - 19




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ఈతరం వినూత్న ఉద్యమం ఈ సురాజ్య యాత్ర........ 5
విమ్స్‌ను మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలి........................ 9
స్వరాజ్యం వచ్చినా సురాజ్యం రాలే.............................. 10
స్కూళ్ల గురించే పట్టని నేతలు, అధికారులు..................11
ఇంజినీరింగ్ చదివి కూలీలవుతారా?.......................... 12
తుమ్మపాల కర్మాగారం రైతులు, కార్మికుల సమస్యల...13
ఆరిలోవ జేపీ... యువత, విద్యార్థులు, మహిళల.......... 14
ప్రభుత్వ విద్యావ్యవస్థను కడిగేసిన యూత్ అసెంబ్లీ..... 15
దివాళా అంటూనే దుబారా చేస్తున్నారు..................... 17
పార్టీలకతీతంగా సమస్యలపై పోరాటం చేద్దాం......... 18
రైవాడ రైతులను మోసేం చేస్తే ముందుండి................ 20
మార్పు తప్ప నాకు ఇంకేం అవసరం లేదు................... 21
యువత అరచేతిలోనే జాతి నిర్మాణంలో..................... 22
లంచాలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు ................. 23
కులం కంటే బతుకులు ముఖ్యం.................................. 24
సమాజం కూడా చదువులో భాగమే............................. 25
మిత్రులతో కలిసి కరపత్రాలు విడుదల......................... 26
బీసీలు, దళితుల కోసం జేపీ........................................ 28
రైతులు, కౌలురైతుల కోసం జేపీ................................. 29
మధ్యతరగతి కోసం జేపీ............................................. 30
నెక్ట్స్ ఏంటి ? ..... (యూత్ కోసం జేపీ)........................ 31
రైతు సమన్వయ కమిటీలు రాచరిక వ్యవస్థే............... 32
(మీడియాలో) 'కీ' కామెంట్లు........................................ 33
బాలల భద్రత - భారత భద్రత....................................... 34

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# తలాక్ సాంప్రదాయం - సాంప్రదాయ రాజకీయం



మూడుసార్లు తలాక్ అనేసి మహిళలకు తక్షణ విడాకులిచ్చే ఇస్లాం సాంప్రదాయం చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూడా తక్షణ వార్తల జాబితాలో చేరిపోయింది. ఎన్నికలు, అధికారం చుట్టూనే ప్రదక్షిణాలు చేసే అలవాటు నుంచి సమాజం, మీడియా ఇంకా బైటపడనందున.. పెద్దస్థాయి చర్చకు మళ్లీ అధికార పార్టీ వారు కోరుకునేదాకా వేచిచూడాల్సి రావచ్చు. మామూలు పరిస్థితుల్లోనైతే ఈ కేసులో న్యాయస్థానం తీర్పు చాలా చిన్న అడుగే. కానీ లౌకికవాదం, మైనారిటీల గళాలు, అస్తిత్వ ఆందోళనల పట్ల గౌరవం, రాజకీయ, పాలనాదక్షత పేరుతో ఏడు దశాబ్దాలపాటు మనదేశంలో కాంగ్రెస్, వామపక్షాలు సహా అన్ని పార్టీలూ ఆడిన నాటకాల వల్ల అదో పెద్ద తీర్పు అనే చెప్పవచ్చు. ఉద్దేశపూర్వకంగానో, అవగాహనారాహిత్యంతోనో రాజ్యాంగాన్ని తిరగరాయాలన్న ధోరణులు పెరుగుతున్నరీత్యానూ, ప్రపంచవ్యాప్తంగా వహాబిజం హింసను నిర్మూలించేందుకు నిజమైన ఇస్లాంలోని హేతుబద్ధ, సంస్కరణ గళాల్ని ప్రోత్సహించాల్సిన రీత్యా కూడా ఈ తీర్పును పెద్ద విజయంగానే చెప్పాలి. స్త్రీ కావచ్చు, పురుషుడు కావచ్చు.. ఒక మనిషి పట్ల ఇంకో మనిషి అమానుషంగా ప్రవర్తించినా 'మామూలే' అనే మోరల్ న్యూట్రాలిటీతో మనం ప్రవర్తిస్తే, అది ప్రజాస్వామ్యం ఎట్లవుతది? త్రివర్ణ పతాకంలోని నీలిరంగు ధర్మచక్రానికి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ ప్రమాణాలకు విలువేమిటి? కేవలం 70 ఏళ్ల పాటు మన రాజకీయ, పాలనా, న్యాయవైఫల్యం వల్లే.. ఈవేళ ఈ చిన్న తీర్పు పెద్ద విజయంగా మారింది. మనకు భావప్రకటనా స్వేచ్ఛ ఏమాత్రం తగ్గినా, ధర్నాలు, బంద్‌లు, రాస్తారోకోలు చేస్తాం కానీ, కోట్లాదిమంది మహిళల నోరు నొక్కేస్తున్నా, మైనారిటీల మనోభావాల పేరుతో మనం మౌనప్రేక్షకుల్లానే ఉంటాం. దశాబ్దాల ఈ కపట రాజకీయం వల్లే తక్షణ తలాక్ విడాకుల రద్దు.. మానవ హక్కులకు, మహిళా స్వేచ్ఛకు, హేతుబద్ధ భావాలకు పెద్ద విజయం! ఫిరాయింపుల కట్టడి పేరుతో ఫిరాయింపులను ప్రోత్సహించే చట్టాన్ని (1985) తెచ్చిన రాజీవ్‌గాంధీ ప్రభుత్వం.. తన ఏకస్వామ్య పార్టీ నియంతృత్వంలో భాగంగానే 'విప్' పేరుతో కాంగ్రెస్ నేతల నోళ్లు నొక్కేసింది. లేకుంటే షాబానో కేసులోనే ముస్లిం మహిళలకు 'తలాక్' సంకెళ్లు తెగి ఉండాలి. షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా 'ముస్లిం మహిళల మనోవర్తి' చట్టం తెచ్చి, ఆ తర్వాత హిందువులను సంతృప్తిపరచేందుకు అయోధ్యలో వివాదాస్పద మందిరం-మసీదు తాళాల్ని రాజీవ్‌గాంధీ తెరిపించారు. శిలాన్యాసానికి కకూడా అనుమతించి చివరకు కాంగ్రెస్ పతనానికి బీజాలు వేశారు. ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌లాగా ఆవేళ రాజీవ్ నిర్ణయాన్ని కాంగ్రెస్ పెద్దలు ఎండగట్టి ఉంటే, పార్లమెంట్‌లో ఆ చట్టాలు ఆమోదం పొందేవి కావు. కాంగ్రెస్ ఈవేళ ఇంత దురవస్థ పాలవ్వాల్సి వచ్చేది కాదు. దేశమంతా ఒకే సంప్రదాయాన్ని పాటించాలని, మతవిశ్వాసాల్ని ప్రభుత్వ చట్టాల్ని శాసించాలని లోక్‌సత్తా ఏనాడూ చెప్పదు. రాష్ట్రాలకు సొంత రాజ్యాంగాలు, మరింత స్వయంప్రతిపత్తి ఉండాలని, స్థానిక ప్రభుత్వాలతో దిగువన స్వతంత్ర పాలన ఉండాలని వాదిస్తున్నప్పుడు.. ఓ మతవిశ్వాసంలో ప్రభుత్వ జోక్యాన్ని ఎలా అనుమతించగలం? అందుకే ఉమ్మడి సివిల్‌కోడ్‌ను కూడా ఏకపక్షంగా అమలుచేసే ప్రయత్నాల్ని వ్యతిరేకిస్తున్నది. ఇప్పుడు ఉమ్మడి సివిల్‌కోడ్ కంటే ముఖ్యమైన విషయాలు చాలా ఉన్నాయని మోదీ ప్రభుత్వానికి కూడా చాలాసార్లు లోక్‌సత్తా చెప్పింది. ఇదేసమయంలో.. ఇతరుల హక్కులను హరిస్తూ, ఇతరుల ఎదిగే అవకాశాలను దెబ్బతీస్తూ, సమాజం మీద దుష్ప్రభావం చూపే ఏ మతవిశ్వాసాన్నీ అనుమతించకూడదని కూడా లోక్‌సత్తా భావిస్తుంది. ఇతరులను ఇబ్బందికి గురిచేయకుండా ఎటువంటి విశ్వాసాన్నయినా కలిగిఉండే హక్కు ఎవరికైనా ఈ దేశంలో ఉ ండవచ్చు. కామన్ సివిల్ కోడ్‌కైనా ఇదే గీటురాయి వర్తించాలి. దేశ విభజన సమయంలో తలెత్తిన భీతావహ పరిస్థితుల మధ్య కూడా అమెరికా, స్విట్జర్లాండ్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలకంటే మిన్నగా మనదేశం స్వతంత్రం వచ్చిన వెంటనే సాహసోపేతంగా మహిళలు సహా వయోజనులందరికీ ఓటు హక్కు ఇచ్చిందని గర్వపడుతుంటాం. రాజ్యాంగంలో గొప్ప విలువలున్నాయని పొంగిపోతుంటాం. కానీ వాటి అమలుకు తగిన వాతావరణాన్ని కల్పించే వ్యవస్థలు లేకుంటే వచ్చే దుష్పరిణామాల్ని ఇప్పటికీ సరిగా గుర్తించలేకపోతున్నాం, కనీసం చర్చించలేకపోతున్నాం. రాజ్యాంగ నిర్మాతల వైఫల్యాలను సరిచేయలేకపోతున్నాం. అవిద్య, పేదరికం అపారంగా ఉన్న సువిశాల, సంక్లిష్ట సమాజంలో అందరికీ ఓటుహక్కు ఉంటే, ఒక్క ఓటు తేడాతో గెలుపోటములు నిర్ణయమైపోతూ మైనారిటీల మనోభావాల పేరిట తలాక్ వంటి దురాచారాలు కొనసాగడంలో పెద్ద ఆశ్చర్యం కనిపించదు. పురుషాధిక్య రాచరికానికి- వలస పాలనకు-ఉదాత్త రాజ్యాంగానికి మధ్య పెద్ద తేడా కనిపించదు. అందరికీ ఓటుహక్కుతోపాటు మంచి విద్య, ఆరోగ్యం అందించే ఏర్పాట్లు చేస్తూ, రిజర్వేషన్ల తరహాలో ఓటుహక్కును కూడా కొంతకాలంపాటు స్థానిక స్థాయి నుంచి జాతీయస్థాయి వరకూ అంచెలవారీగా విద్యార్హతతో ముడిపెట్టి ఏర్పాట్లు చేసి ఉంటే బాగుండేది. అలాగే అందరికీ ప్రాతినిధ్యం కల్పించేలా దామాషా పద్ధతిని కూడా ఎన్నికల వ్యవస్థలో కొంతమేరైనా మిళితం చేయాల్సింది. ఖలీఫా దేశం టర్కీలోనే ముస్తఫా కెమాల్ పాషా ఆధ్వర్యంలో సంస్కరణలు వస్తుంటే, మనదేశంలో స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలీగ్ ఛాందస భావాలను రెచ్చగొట్టి బలపడింది. దీనికి కారణం కాంగ్రెస్ నేత దూరదృష్టి లోపం. స్వతంత్రం వచ్చాక కూడా కాంగ్రెస్‌లో ఆ అపరిపక్వత కొనసాగింది. జాతీయోద్యమ నేతల తరం కనుమరుగయ్యాక ఆ అపరిపక్వత చుట్టూనే ముస్లిం ఓటుబ్యాంకు రాజకీయాలు రాజ్యమేలాయి. సాంప్రదాయ పార్టీలుగా దిగజారిన కాంగ్రెస్, ప్రాంతీయపార్టీల్లాగే సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలు కూడా మైనారిటీల విషయంలో వ్యవహరించడం మాత్రం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ముస్లింల వెనకబాటుతనానికి కారణమైన అవిద్య, పేదరికం వంటి సమస్యలను నిర్మూలించటానికి మాత్రం వీరు ఎలాంటి నిర్మాణాత్మక ఎజెండానూ ప్రతిపాదించలేదు. ఇలా ఏదోకరకంగా ఎన్నికల్లో గెలవటం స్థాయికి పరిమితం కావటం వల్లే మనదేశంలో ప్రజాస్వామ్యమున్నా, నియంతృత్వ చైనా మనకంటే మెరుగైన దేశంగా కనిపిస్తోంది. కాబట్టి, మన పెద్దల తప్పిదాల్ని సరిచేయటానికి మనముందున్న బాధ్యతలు సుస్పష్టం. ట్రిపుల్ తలాక్‌పై తీర్పును పాలకులు విస్తరించి హిందూయిజంలోని లింగ వివక్ష నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వేగంగా తక్కువ ఖర్చుతో న్యాయం వంటివి ప్రభుత్వాల ఎజెండా కావాలి. కులమతాల ఉచ్చులో చిక్కుకోకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి దామాషా ఎన్నికల పద్ధతిని తేవాలి. ప్రతిపక్షాలు, అస్తిత్వ ఉద్యమాల అసమర్థత వల్ల ట్రిపుల్ తలాక్ విషయంలో మోదీ పార్టీ రాజకీయంగా విజయం సాధించి ఉండవచ్చు. ముస్లింలలో పలువురి ఓట్లు అవసరం లేకుండానే గెలిచే ఫార్ములాను కనిపెట్టి ఉండవచ్చు. కానీ ఓ సగటు ముస్లింలో పెరుగుతున్న భయాన్ని తొలగించి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే ఇతర సంస్కరణల్ని తేకపోతే మాత్రం చరిత్రలోని పీడకలలు ఊహించని అధ్యాయాలుగా పునరావృతమయ్యే అవకాశముంది.



# ఈతరం వినూత్న ఉద్యమం ఈ సురాజ్య యాత్ర: జేపీ

"సురాజ్యం మన జన్మహక్కు..! కానీ స్వరాజ్యం వచ్చి 70 ఏళ్లు గడచినా ఇంకా సురాజ్యం దరిదాపుల్లోకి కూడా మనం చేరుకోలేకపోయాం. కాస్త చెప్పుకోదగిన ఏ దేశంతో పోల్చినా జనం జీవితాల్ని బాగుచేసే ప్రమాణాల్లో మనం అట్టడుగున ఉన్నాం. డబ్బు, వనరులు లేక కాదు, జనంలో బాగుపడాలనే తపన, సత్తా లేక కాదు.. కేవలం సరైన రాజకీయం, విధానాలు లేకే మనం సురాజ్యాన్ని అందుకోలేకపోతున్నాం. విద్య, వైద్యం, ఉపాధి వంటి కీలకావసరాలను అందించకుండా ప్రభుత్వాలు ఉత్తుత్తి పాలన చేస్తున్నాయి. నేతలు, పాలకులు తాత్కాలిక తాయిలాలతో జనాల్ని మోసం చేస్తున్నారు. అందుకే ఈతరం ఉద్యమంగా ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ వినూత్న రీతిలో సురాజ్య యాత్రను ప్రారంభించాం'' అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.

21 ఏళ్లుగా లోక్‌సత్తా వివిధ రూపాలలో రాజకీయ, పాలనా సంస్కరణలకోసం పనిచేస్తూ ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా పలు రాజ్యాంగ సవరణల్ని, చట్టాల్ని, విధానాల్ని తీసుకొచ్చిందని, ప్రజల్లో చైతన్యం తెచ్చిందని.. మారిన పరిస్థితులకనుగుణంగా ఈతరం కోసం యువత, ఇతర వయసుల ప్రజలకు **'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్'** అనే వెబ్ ప్లాట్‌ఫారాలతో తాజాగా వినూత్న పంథాలో సురాజ్య యాత్రను ప్రారంభించిందని జేపీ తెలిపారు. మార్పును కోరుకునే సంస్థలు, వ్యక్తులు ఎవరైనా ఈ జనహితం కోసం సురాజ్య యాత్రలో పాల్గనవచ్చున్నారు.

'జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర'ను జయప్రకాష్ నారాయణ్ సెప్టెంబర్ 15, 2017న విశాఖపట్నం నుంచి ప్రారంభించారు. తొలిరోజు వివిధ కార్యక్రమాల్లో, మీడియాతో సురాజ్య ఎజెండాపై మాట్లాడారు. విద్యార్థులు, యువత, కార్మికుల విద్య, వైద్య, ఇతర సమస్యలను తెలుసుకున్నారు. లోతుగా చర్చ చేస్తూ సురాజ్య పరిష్కారాలను తెలిపారు. వాటిని కలసి సాధించుకునే కార్యాచరణను వివరించారు.

మానవ వనరుల్లో తాజా నివేదిక ప్రకారం మనం 113వ స్థానంలో ఉన్నా, 57 చెప్పుకోదగిన దేశాల్లో కీలక రంగాల్లో 55వ స్థానంలో ఉన్నా.. ప్రజల జీవితాల్ని బాగుచేసే ఎజెండాని కనీసం చర్చకు కూడా రానీయకుండా చేస్తూ పైపై అంశాలనే గొప్ప విజయాలుగా ప్రచారం చేస్తూ పాలకులు, పార్టీలు, సమాజంలో శక్తి ఉన్నవారు మోసం చేస్తున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అనారోగ్యం వల్ల ఈ దేశంలో ఏటా 6కోట్ల 40లక్షల మంది పేదరికంలోకి జారిపోతున్నారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించలేనప్పుడు పరిపాలన ఎందుకు అని ప్రశ్నించారు.



### విద్య, వైద్యంపై చిత్తశుద్ధి అవసరం

విద్య, వైద్యంపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని జేపీ అన్నారు. గాజువాకలోని టీఎస్సార్-టీబీకే కళాశాలలో సురాజ్య యాత్ర ముఖాముఖిలో భాగంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ప్రజలకు అందాల్సిన చదువు, ఆరోగ్యంపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ తీసుకుంటే అతి తక్కువ ఖర్చుతోనే మౌలిక వసతులు కల్పించవచ్చన్నారు. 3.19 కోట్ల మంది కార్మికులు తమ జీతాల నుంచి చెల్లిస్తున్న నగదుతో ఈఎస్ఐ కార్పొరేషన్‌కు ఏటా రూ. 12వేల కోట్లు సమకూరుతున్నాయన్నారు. అయినా ఈఎస్ఐ ఆసుపత్రిలో వసతులు కానరావని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను తగ్గించి దిగుమతులను పెంచడం వల్ల రైతులకు రూ. 1.30లక్షల కోట్ల నష్టం వచ్చిందన్నారు. రాష్ట్రంలో మంచినీరు కన్నా మద్యం ఎక్కువగా దొరుకుతోందన్నారు. ఓట్ల రాజకీయం కోసం జీతాలు పెంచుతున్న ప్రభుత్వాలు.. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కోసం మాత్రం డబ్బులేదని చెప్పటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్ టి.బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత పాలకులు, నేతలు చేస్తున్న తప్పిదాల వల్ల వారికొచ్చే నష్టంకన్నా యువతే ఎక్కువ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. "రాబోయే కాలంలో 90శాతానికి పైగా మీదే, లేవండి" అంటూ మేలుకొలిపారు. ఈ సురాజ్య యాత్రలో ప్రభుత్వాలు లక్ష కోట్లతో చేయాల్సిన పనులేవీ తాను చెప్పటం లేదని, ప్రజల జీవితాల్ని బాగు చేసే కొన్ని ప్రధానాంశాలకు దాదాపుగా ఖర్చు లేని పరిష్కారాలనే, వెంటనే అమలు చేయగల

### మంచి కోసం ప్రజలు త్యాగాలకు సిద్ధంగానే ఉన్నారు, తాయిలాల వలలో చిక్కకుండా ఉంటే చాలు.. అద్భుతాలు సృష్టిస్తారు

మన వైఫల్యాలకు పూర్తిగా ప్రజలను నిందించి ప్రయోజనం లేదని, ఏ కాస్త మంచి జరుగుతుందని నమ్మకం ఉన్నా ఆ నేతల చర్యలను సమర్థిస్తూ త్యాగాలకు సైతం వెరవటం లేదని జేపీ అన్నారు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) ద్వారా అవినీతి అంతమవుతుందన్న నమ్మకం ఉండబట్టే, కష్టనష్టాలకు ఓర్చి మరీ ప్రజలు సంయమనం పాటించారన్నారు. డీమానిటైజేషన్ సమయంలో భారతీయులు వ్యవహరించిన తీరు ప్రపంచ చరిత్రలోనే అరుదైనదన్నారు. కానీ దీనివల్ల పార్టీలకే ఎక్కువ లాభం చేకూరిందన్నారు. ప్రజలు తాత్కాలిక తాయిలాల వలలో చిక్కకుండా కాస్త ఆలోచించగలిగితే అద్భుతాలు సృష్టించగలరని, రాజకీయాల్లో మార్పు వస్తేనే దేశం బాగుపడుతుందని అన్నారు.

### చదువుతోపాటు సామాజిక చైతన్యం ఉండాలి

విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక చైతన్యం ఉండాలని జేపీ సూచించారు. జనహితం కోసం సురాజ్య యాత్ర తొలిరోజు కార్యక్రమంలో భాగంగా గాజువాక చైతన్యనగర్‌లోని చైతన్య మహిళా కళాశాలలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగిస్తున్నాయని, యువతలో మార్పు రానంత వరకూ పరిస్థితులు ఇలాగే ఉంటాయని అన్నారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించిననాడు ప్రభుత్వాలు భయపడతాయన్నారు. సమాజంలో మార్పు తెచ్చేందుకు చేస్తున్న సురాజ్య యాత్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వెబ్ ప్లాట్‌ఫారాల ద్వారా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థుల సమస్యలను, సందేహాలను తెలుసుకుంటూ జేపీ మాట్లాడారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ విజయలక్ష్మి, కృష్ణకుమారి, కామేశ్వరి, ఎంఎల్ నరసింహం, విక్రం తదితరులు పాల్గొన్నారు.

### పారిశ్రామికరంగంపై యువత ఉత్సాహం చూపాలి

యువతలో ఆదర్శాలతోపాటు వాటిని సాధించుకునే తెలివి, ఉద్యమస్ఫూర్తి కావాలని జేపీ అన్నారు. పారిశ్రామికరంగంపై ఉత్సాహం చూపాలన్నారు. విద్య, వైద్యం, వ్యాపార, వ్యవసాయ రంగాలు అభివృద్ధి చెందిననాడు రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందినట్టేనన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా తొలిరోజు విశాఖ ఆటోనగర్ వాసివా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవం సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించి నూతన సంస్కరణలకు అవకాశం కల్పించాల్సుందని జేపీ అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి స్థానిక పరిశ్రమలకు తోడ్పాటు కరవవుతోందని ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఉక్కు కర్మాగారాలు తక్కువ ధరకు స్టీల్ ఉత్పత్తులు అందిస్తుంటే, విశాఖ ఉక్కు కర్మాగారం స్థానికంగా ఉన్న పరిశ్రమలకు, వినియోగదారులకు అధిక ధరలకు అందిస్తోందని పలువురు పారిశ్రామిక ప్రముఖులు ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ఆటోనగర్ సూక్ష్మ చిన్న పరిశ్రమల అధ్యక్షుడు ఎ.కృష్ణ బాలాజీ, కోశాధికారి కృష్ణప్రసాద్, ఐలా వైస్ ప్రెసిడెంట్ పట్టా నారాయణరావు, వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు, డి.వినోద్, ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్లు కేఆర్‌కే ప్రసాద్, జీవీఆర్ నాయుడు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పరిష్కారాలనే చెబుతానని అన్నారు. నిరుద్యోగ యువత, రైతులు, దళితులు, వెనకబడినవర్గాలు, మధ్యతరగతి వర్గాలతో సమస్యలపై చర్చిస్తూ వారి అభిప్రాయాలతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారాలను తయారుచేస్తామన్నారు. వీటిని సాధించటానికి అవసరమైతే ప్రభుత్వంతో పోరాటానికీ సిద్ధమేనన్నారు. ప్రజలు ఓట్లను, పన్నుల డబ్బును తెలుగు రాష్ట్రాల్లో, ఢిల్లీలో వేరెవరికో ఇచ్చారని, కానీ వారు సక్రమంగా చేయనప్పుడు, మన ఆకాంక్షలు నెరవేరే పరిస్థితి లేనప్పుడు పౌరులుగా గళం విప్పాలని, వివిధ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలను గాడిన పెట్టాలని జేపీ అన్నారు. ప్రజల జీవితాల్ని బాగు చేసే ఒక స్పష్టమైన, వెంటనే అమలు చేయగల ఎజెండాను అందిస్తూ, అందుకు వేదికగా ఉండేందుకే లోక్‌సత్తా మలిదశలో ఈ సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

పన్నులు పెంచుకుంటూ పోతున్న ప్రభుత్వాలు యువతకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలను కల్పించటం లేదని జేపీ దుయ్యబట్టారు. ఓపక్క యువతకు ఉద్యోగాలు అందించటంలో విఫలమై నిరుద్యోగ భృతి తప్ప గత్యంతరం లేదంటూ చేతులెత్తేసిన

**అడగకున్నా చంద్రబాబుకు సూచనలిచ్చా**

లోక్‌సత్తా ఓ ఉద్యమం. లక్ష్యం కోసం వేదిక. సురాజ్య యాత్ర ఓ గొప్ప ఆశయంతో చేపట్టిన కార్యక్రమం. సంకుచిత ఎన్నికల దృష్టితో చూడవద్దు అని జేపీ కోరారు. చంద్రబాబు నాయుడు అడగకపోయినా ప్రజలకు ఉపయోగపడే కొన్ని సూచనల్ని లేఖల ద్వారా ఇచ్చానని, స్వీకరిస్తారో లేదో ఆయనిష్టమని అన్నారు.







ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంకా ఎక్కువమంది పిల్లల్ని కనండి అంటూ పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సరైన చదువు లేదు, వ్యవసాయం చేసుకుందామంటే అప్పుల్లో కూరుకుపోవాల్సి వస్తుంది, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలివ్వనిదే పనులు జరగవు, బైటకెళ్తే భద్రత లేదు.. ఇంకా ఇంకా పిల్లల్ని కని ఇలాంటి సమాజం పాలు చెయ్యాలా? బాధ్యతగల తల్లిదండ్రులెవరైనా ఇలాంటి దుర్మార్గం చేయగలరా? అని ప్రశ్నించారు.

బడ్జెట్‌లు లక్షల కోట్లలో ఉన్నా, ప్రజల పేరు మీద రోజుకు రూ. 11,000 కోట్లు ఖర్చు చేస్తున్నా.. జీవితాల్ని బాగుచేసుకోవటానికి జనానికివ్వాల్సిన చదువు, ఆరోగ్యం, తలెత్తుకుని బతికే ఉపాధి అవకాశాలు అందించటంలో ప్రభుత్వాలు క్షమార్హంకాని రీతిలో విఫలమవుతున్నాయన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధులు భారీగా పెరిగినా, ఆ నిధులు దిగువన ప్రజలుండే, వారి రోజువారీ అవసరాలతో ముడిపడిన స్థానిక ప్రభుత్వాలకు ఎందుకు చేరటం లేదని ప్రశ్నించారు. అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకుని డబ్బును ఇష్టమొచ్చినట్టు ప్రచార ఆర్భాటాల కోసం ఖర్చు చేయటం వల్లే, జనం జీవితాల్ని బాగు చేసే రంగాల్లో ఫలితాలు మొక్కుబడిగా మారిపోయాయన్నారు. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో గురుకుల పాఠశాలల్ని నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్, రాములు వంటి వారు ఒక్కో విద్యార్థి మీద ఏడాదికి రూ. 40,000 ఖర్చుతోనే మంచి ఫలితాలను సాధిస్తున్నారని, కానీ ఒక్కో విద్యార్థి మీద రూ. 45,000-48,000 ఖర్చు చేస్తున్నా (సుమారు రూ. 23,000కోట్లకు బడ్జెట్‌ను పెంచి ఒక్కో విద్యార్థి మీదా రూ. 60,000 ఖర్చు చేస్తున్నట్టు ఆ తర్వాత ఏపీ

**ఈఎస్ఐ ఆస్పత్రి తరలింపు నిర్ణయం సరికాదు**

కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందించటంలో ఈఎస్ఐ కార్పొరేషన్‌కు చిత్తశుద్ధి లేదని, కార్మికుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యుల తీరుపై జేపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ సింధియాలోని ఈఎస్ఐ ఆస్పత్రిని సురాజ్య యాత్రలో భాగంగా ఆయన సందర్శించారు. వైద్యసేవల తీరుపై రోగుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల జీతాల్లో నుంచి కోత విధించిన డబ్బుతో మెరుగైన సేవలు అందించడంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఆసుపత్రి నిర్వహణలో సమస్యలపై సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్వీ ప్రమీలతో చర్చించారు. తాను విశాఖ జిల్లాలో పనిచేసినప్పుడే ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయించానని, దీన్ని ఆరిలోవ ప్రాంతానికి తరలించటం సరైన చర్య కాదని అన్నారు. ఆస్పత్రి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

**జిప్సా సమస్యల నివేదన**

జేపీకి ప్రైవేటు పాఠశాలల సంఘం (జిప్సా) అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వి.కె పరశురాం, శ్రీనివాసరావు, పాలూరి లక్ష్మణస్వామిలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ ఆంక్షల వల్ల విద్యావ్యవస్థ కుంటుపడిందని, చిన్న, మధ్యతరగతి ప్రైవేటు పాఠశాలల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ అవసరమా?

దేశంలో కోట్ల రూపాయల ఖర్చుతో బుల్లెట్ రైలు వేసే కంటే ఆ డబ్బుతో భారతీయ రైల్వేను అభివృద్ధి చేయటం మేలైన పని అని జేపీ అన్నారు. బుల్లెట్ రైలు కోసం 508 కిలోమీటర్లకు లక్షా 10వేల కోట్ల రూపాయలు తగలేస్తున్నారని, దీనివల్ల 30వేల మందికి మాత్రమే ఉపాధి వస్తుందని అన్నారు. అదే డబ్బుతో 10వేల కిలోమీటర్ల రైల్వే లైన్లను అభివృద్ధి చేస్తే గంటకు 160 కిలోమీటర్లకు పైగా వేగంతో కోట్లాది మందిని సురక్షితంగా గమ్యాలకు చేర్చవచ్చని, దేశ ప్రయోజనాలకు కూడా గట్టి మేలు చేయవచ్చని అన్నారు.



## ఏపీకి నాకంటే ఎక్కువ చేసిన వాళ్లెవరు?

ఓట్లు, సీట్లు పొందినవారికంటే కూడా అనేకరెట్లు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు తాను కృషి చేశానని, కావాలంటే అసెంబ్లీ నుంచి పార్లమెంటు దాకా సాక్ష్యాధారాల్ని బైటికి తీయాలని జేపీ సవాల్ చేశారు. రాష్ట్రం విడిపోతే హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోవటం వల్ల ఏపీకి వచ్చే రెవెన్యూ నష్టం ఎంత, ఎలా భర్తీ చేయాలి. తదితర అంశాలన్నిటినీ అసెంబ్లీలో పేర్కొన్నానని, ప్రత్యేక హోదా ప్రతిపాదన తనదేనని అన్నారు. ఈ లెక్కల్నే, ప్రతిపాదనల్నే అన్ని ప్రధాన పార్టీలూ పార్లమెంటులో ప్రస్తావించాయని, ప్రధాని రాజ్యసభలో ప్రత్యేకహోదాకు హామీ ఇచ్చారని అన్నారు. రాష్ట్ర విభజనకు లేఖలిచ్చిన పార్టీలు, రెండు రాష్ట్రాల్లో రెండు రకాల మాటలు మాట్లాడి ఓట్లు, సీట్లు పొందిన ఆ పార్టీల అధ్యక్షులు ఆ రోజున కనీసం మాట వరసకు కూడా ఏపీకి ఏం చేయాలో అడగలేదన్నారు. 2009లో లోక్‌సత్తాకు అసెంబ్లీలో ఒక్క సీటే ఇచ్చినా, పెద్దగా ఓట్లు వేయపోయినా.. తాను ఏపీ భవిష్యత్తు కోసం, తెలుగు ప్రజల మధ్య సామరస్యత, రెండు రాష్ట్రాల అభివృద్ధి కోసం పోరాడానన్నారు.

## ఆ విషవలయాన్ని ఛేదించటం గురించి మరోసారి మాట్లాడుకుందాం

రాజకీయపార్టీలలో అందరూ చెడ్డవారు కాదని, వారో విషవలయంలో కూరుకుపోయారని జేపీ అన్నారు. ఈ విషవలయాన్ని ఛేదించి ఎన్నికల్లో నిజాయతీపరులు, సమర్థులు గెలిచే ఏర్పాట్ల గురించి తర్వాత మాట్లాడుకుందామన్నారు.



మానవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు) ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు రావటం లేదని అన్నారు. ఎందుకిలా జరుగుతోందో కనీసం సమీక్ష లేదన్నారు. మన చుట్టూనే కొన్ని మంచి ఉదాహరణలున్నా వాటిని అధ్యయనం చేసి ఇతర రంగాలకు ఉపయోగించుకునే తీరిక కూడా పాలకులకు లేదన్నారు. ఎలాగోలా ఎన్నికల్లో గెలవటమే తప్ప, గెలిచాక ఏం చేస్తున్నారన్న విషయం మీద చర్చ రానీయకుండా చేస్తున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో గురుకుల, నవోదయ పాఠశాలల విజయం.. అధికార వికేంద్రీకరణ ఆవశ్యకతను తెలియచెప్పటంలో కూడా మంచి ఉదాహరణలన్నారు. వనరుల్ని, లక్ష్యాల్ని జవాబుదారీతనంతో ఇచ్చి స్వేచ్ఛగా వదిలేస్తే, ప్రభుత్వ పెత్తనంలోని సంస్థలకన్నా గొప్ప ఫలితాలిస్తాయని ఈ స్కూళ్లు నిరూపిస్తున్నాయన్నారు.

**మన జీవితాల్ని బాగు చేసే కీలక విషయాలలో ప్రభుత్వాల విధానాలను, అవి చేస్తున్న ఖర్చు-వస్తున్న ఫలితాలను బేరీజు వేసుకుని సుపరిపాలన జరిగేలా చేసేందుకు యువత, ఇతర వర్గాల ప్రజలు తమకు చేతనైనరీతిలో ముందుకు రావాలని, ఇందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా ఆన్‌లైన్ వేదికల్ని ఉపయోగించుకోవాలని జేపీ విజ్ఞప్తి చేశారు.**

**"మీరు మీ జీవితాల్ని, కెరీర్‌లను చూసుకుంటూనే చిన్న చిన్న సమస్యల మీద మిగిలినవారితో కలసి మీ ప్రాంతంలోనే సంఘటితంగా ఈ వేదికల ద్వారా పోరాడండి. దీన్నో దీర్ఘకాలిక కార్యక్రమంగా కొనసాగించటానికి మీకు చేతనైన విరాళాల్ని ఇవ్వండి, సేకరించండి. మీరు విరాళాల్ని ఇవ్వడానికి ఎఫ్‌డీఆర్ఇండియా.ఆర్గ్‌ను సంప్రదించవచ్చు. మీకు రసీదుతోపాటు ఆదాయపన్ను మినహాయింపు వస్తుంది. నాయకులు, పెత్తనాలు లేకుండా స్వేచ్ఛగా, చర్చించుకుంటూ మీరు సమాజంలో మంచి మార్పును తేవచ్చు"** అని జేపీ అన్నారు.

సురాజ్య యాత్ర తొలిరోజు కార్యక్రమాల్లో లోక్‌సత్తా మలిదశ (2.0) ఉద్యమ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జిల్లా కన్వీనర్ నాయుడు వేణుగోపాల్, యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ప్రతినిధి వి.హరిగణేష్, జనబలం పత్రిక ఎడిటోరియల్ సభ్యుడు శిరమణి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ✍

# 'విమ్స్'ను మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలి, ఉత్తరాంధ్రవాసులకు భారంలేని వైద్యం అందించాలి






సురాజ్య యాత్రలో భాగంగా విశాఖలోని విమ్స్ ఆస్పత్రిని జేపీ సందర్శించారు. వైద్యసిబ్బందితో మాట్లాడారు. ఓపీ, ఇన్‌పేషెంట్ విభాగాలలో వైద్యసేవల్ని ఎలా అందిస్తున్నారు, ఆస్పత్రి సిబ్బంది ఎలా స్పందిస్తున్నారు.. వివరాలను రోగులను, వారి సహాయకులను అడిగి తెలుసుకున్నారు.

విమ్స్‌లో 450 పడకలు అందుబాటులో ఉండగా, కేవలం 100మాత్రమే వినియోగంలో ఉండటం విచారకరమని జేపీ అన్నారు. ఇంకా చాలా మెరుగుపరిస్తేనే ప్రజలకు నాణ్యమైన సేవలందుతాయని అన్నారు. ఆసుపత్రిలో తగినంతమంది డాక్టర్లు, సిబ్బందిని తక్షణమే నియమించాలన్నారు. విమ్స్ డైరెక్టర్ సీవీ రావు ఆధ్వర్యంలో డాక్టర్లు, సిబ్బంది సానుకూల దృక్పథంతో పనిచేస్తున్నారని, వారికి జవాబుదారీతనంతో కూడిన స్వేచ్ఛనివ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఖర్చు ఎంతయింది, ఫలితం ఎంత వచ్చిందీ అని ప్రభుత్వం బేరీజు వేసుకోవాల్సుందన్నారు. విమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దాలి తప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయికి దిగజార్చవద్దని సూచించారు. కేజీహెచ్‌ని మించిన స్థాయిలో ఇక్కడ వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రశాంతవాతావరణంలో సువిశాలంగా నిర్మించిన విమ్స్‌ను ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా మోడల్ హాస్పిటల్‌గా తీర్చిదిద్దాలని, ఉత్తరాంధ్రలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారంలేని నాణ్యమైన వైద్యాన్ని అందించాలని జేపీ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీవీ రావు, ఆర్థో, న్యూరో, అంకాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యులు, యూత్ ఫర్ బెటర్ ఇండియా ప్రతినిధులు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ (2.0) రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జిల్లా కన్వీనర్ వేణుగోపాల్, లోక్‌సత్తా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పట్ల నిరాశ, ఉదాసీనతలను వీడండి








సమస్యలను చూసి నిరాశ చెందాల్సిన పనిలేదని, ఉదాసీనతను వీడాలని, సురాజ్య యాత్ర ద్వారా ఆచరణాత్మక పరిష్కారాలతో మార్పు కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాలని జేపీ విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉడా ఆరోగ్య ప్రాంగణంలో వాకర్స్‌తో కలిసి సురాజ్య యాత్రను ఆయన నిర్వహించారు. నగరంలో ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు, భూగర్భ జలాల పరిస్థితి, ఇతరత్రా వివరాలను వారి నుంచి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి మునిసిపాలిటీలకు నిధులు పెరిగినా, స్థానికంగా వార్డుల్లో మాత్రం సమస్యలు పెరిగిపోతూనే ఉన్నాయని, పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దాకా వెళ్లాల్సి వస్తోందని జేపీ అన్నారు. ప్రజలు కొంత అవగాహనతో ముందుకొచ్చి అధికార వికేంద్రీకరణ కోసం ప్రయత్నిస్తేనే ఈ పరిస్థితిని మార్చగలమన్నారు. బాబ్జీ, నాయుడు వేణుగోపాల్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# స్వరాజ్యం వచ్చినా సురాజ్యం రాలే, బాకాఖర్చులో కొంతిచ్చినా.. హాస్టళ్లు బాగవుతాయి



డెబ్బై ఏళ్ల క్రితం స్వరాజ్యం వచ్చిందిగానీ, ప్రతి బిడ్డకూ చదువును అందించే సురాజ్యం ఈ దేశానికి ఇంకా రాలేదని, అందుకే సంక్షేమ హాస్టళ్లు ఇంత అధ్వాన్నంగా ఉన్నాయని జేపీ అన్నారు. 'జనం కోసం జేపీ సురాజ్య యాత్ర'లో భాగంగా విశాఖ మధురవాడలోని బాలుర వసతి గృహాలను ఆయన సందర్శించారు.

ఆదాయం పెరిగి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా వ్యవస్థలో సురాజ్య మార్పు రావటం లేదని జేపీ అన్నారు. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలో లోపాలను సవరించాలన్నారు. కనీస వసతులు లేకుండా, సమస్యల మధ్య విద్యార్థులు నాణ్యమైన విద్యను ఎలా పొందగలరని ప్రశ్నించారు. మెనూ ఛార్జీలను పెంచటం ద్వారా వసతి గృహాల నిర్వహణను మెరుగుపరచవచ్చన్నారు. ప్రభుత్వం ప్రచారం కోసం పెట్టే ఖర్చులో కొంత వెచ్చించినా వసతి గృహాలను బాగు చేయవచ్చన్నారు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం కాకుండా ప్రజల సమస్యలు పరిష్కరించటానికి కృషి చేసినప్పుడే చదువు, ఆరోగ్యం, ఇతర సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పథకాలు ప్రజలకు అందడంలో జరుగుతున్న అవినీతిని అరికడతామన్న చిత్తశుద్ధి కూడా కరవైందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా విద్యార్థులు చదువే ప్రధానంగా ముందుకు సాగాలని జేపీ అన్నారు. విద్యతో సమాజంలో గౌరవంతో పాటు ఆర్థికంగా కూడా ఎదగగలరన్నారు.

# విద్యావ్యవస్థలో మార్పు వచ్చేలా ప్రశ్నించండి



యువతలో, ఇతర వయసుల ప్రజల్లో ప్రశ్నించే తత్వం కొరవడుతోందని, అందుకే పాలకులు ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తున్నారని, దశాబ్దాలు గడుస్తున్నా కీలక సమస్యలు పరిష్కారం కావటం లేదని జేపీ అన్నారు. విద్యావ్యవస్థలో మార్పు వచ్చేలా ప్రశ్నలు అన్ని వైపుల నుంచీ వెల్లువెత్తాలన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు అంశంపై విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో నగరంలోని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో జేపీ సమావేశమయ్యారు. సురాజ్య యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం లేదని ఈ సందర్భంగా జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బాధ్యతగల పౌరులంతా ప్రశ్నించేలా చేయటమే తమ సురాజ్య యాత్ర లక్ష్యమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూలు తేడా లేకుండా 'ప్రతి కుటుంబంలో, ప్రతి బిడ్డకీ మంచి చదువు అందటం' అందరి లక్ష్యం కావాలన్నారు. విద్యకు ప్రజల్లో డిమాండ్ ఉన్నా అందించలేని అసమర్థ, తప్పుడు పాలన నడుస్తోందన్నారు.

ప్రభుత్వ విధానాల వల్ల తాము అవస్థలు పడుతున్నామని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆరోపించాయి. ప్రభుత్వ అధికారులు ప్రైవేటు పాఠశాలలపై చేస్తున్న పెత్తనంతో పోలిస్తే.. అందిస్తున్న సహకారం దాదాపు శూన్యమన్నారు. సెంట్రల్, స్టేట్ అని కాకుండా దేశమంతా ఒకే సిలబస్ ఉండేలా లోక్‌సత్తా కృషి చేయాలని కోరారు.

అనంతరం జేపీ సమాధానమిస్తూ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేసిన కొన్ని ఫిర్యాదుల్లో పూర్తి హేతుబద్ధత ఉందని, ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. భీశెట్టి బాబ్జీ, బండారు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సావనీర్‌ను ఈ సందర్భంగా జేపీ ఆవిష్కరించారు.



# స్కూళ్ల గురించే పట్టని నేతలు, అధికారులు

నవ్యాంధ్రప్రదేశ్ పాలకులు విద్యావ్యవస్థను పూర్తిగా విస్మరించారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పాఠశాలల పట్ల నిర్లక్ష్యం వల్ల పేదలు, అణగారిన వర్గాలు భారీ మూల్యం చెల్లిస్తున్నారన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా ఆయన విశాఖపట్నం సింహాచలంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ (ఎంజేపీయేపీబీసీ) గురుకుల పాఠశాలను సందర్శించారు.

ఉపాధ్యాయులు ఏం బోధిస్తున్నారు, విద్యార్థులు ఎంత వరకు అవగాహన చేసుకుంటున్నారు.. అని తెలుసుకునేందుకు గతంలో మాదిరిగా తనిఖీలు, పర్యవేక్షణలు లేవని జేపీ విమర్శించారు. దీనివల్ల ఏటా రాష్ట్రంలో విద్యార్థుల పేరు మీద రూ. 20,000 కోట్ల పైచిలుకు ఖర్చు పెడుతున్నా చదువు మాత్రం రావటం లేదని, ఉపాధి ఇవ్వలేని అక్షరాస్యతా కార్యక్రమాన్ని ఆర్భాటంగా కొనసాగిస్తున్నారని అన్నారు. విద్యావ్యవస్థలో ప్రమాణాలు పెంచేవిధంగా సమూల మార్పులు తేవాలన్నారు. పరీక్షలంటే పీడకలలా, విద్యార్థుల మీద ఒత్తిడితెచ్చేవిగా కాకుండా.. అర్థవంతంగా, వికాసాన్ని పంచుకుంటున్నట్టుగా ఉండాలన్నారు. విద్యను విజ్ఞానాన్ని, వికాసాన్ని పెంచే సాధనంగా రూపొందించాలన్నారు. విద్యారంగం పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండబట్టే.. గత ఏడెనిమిదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 15శాతం తగ్గిందన్నారు. ప్రభుత్వం వెచ్చించే సొమ్ముకు తగ్గట్టుగా ప్రమాణాలతో కూడిన విద్య అందకపోవటంపై, యువతకు ఆదాయాన్నిస్తూ కులవివక్షను పోగొట్టే విద్యావ్యవస్థ పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై బాధ్యత గల పౌరులంతా ప్రశ్నించాలన్నదే తమ సురాజ్య యాత్ర ముఖ్య లక్ష్యమన్నారు. విద్యార్థులతో, ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూఢనమ్మకాలను వీడాలని, కులవ్యవస్థకు తలొగ్గద్దని విద్యార్థులకు జేపీ ఉద్బోధించారు. కార్యక్రమంలో బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, వేణుగోపాల్, వైబీఐ నేతలు తదితరులు పాల్గన్నారు. గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కేబీబీ రావు (బద్రి) ఆహ్వానం పలికారు.

సంక్షేమ గురుకుల పాఠశాలలో జేపీ వ్యాఖ్యలు ఇంకొన్ని:

- తెలంగాణలో గురుకుల విద్యావ్యవస్థ బాగుంది. అక్కడ పోటీపడి అభివృద్ధి చేస్తున్నారు. అక్కడ విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడాన్ని ఒక ఉద్యమంగా పెట్టుకుని పనిచేస్తున్నారు. పేదకుటుంబంలో పుట్టిన పిల్లలకు అది శాపం కాకూడదన్న లక్ష్యంతో మంచి బోధన వైపు ఉపాధ్యాయులను ప్రోత్సహించి, రాజకీయ నాయకులను ఒప్పించి మంచి విధానాలను అమలు చేస్తున్నారు. ఆంధ్రాలో ఆ స్థాయి ప్రయత్నం, అందుకు ప్రోత్సాహం లేదు.
- ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఓ లేఖ రాశాను. నమూనా చట్టం చేసి విద్యావ్యవస్థను ఎలా బాగు చేయాలి.. పిల్లల బతుకులను బాగు చేయాలంటే ఏం చేయాలన్న విషయంపై అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు తెలియచేశాను. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదు.
- రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు గురుకుల విద్యాలయాల వ్యవస్థ బాగుందని, జిల్లాలోని అన్ని పాఠశాలలను గురుకులాలుగా మార్చేస్తామని.. ప్రభుత్వ సాయం కూడా అక్కర్లేదని, కేవలం అనుమతిస్తే చాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతగా తపన పడుతున్న వ్యక్తి ప్రతిపాదనను కనీసం పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ప్రభుత్వానికి విద్యారంగంపై ఉన్న ఆసక్తికి ఇదే ఉదాహరణ.

సమస్యలన్నీ పరిష్కారమయ్యేంత వరకూ సురాజ్య ఉద్యమం కొనసాగుతుందని జేపీ స్పష్టం చేశారు.

# ఇంజినీరింగ్ చదివి కూలీలవుతారా?



ఇంజినీరింగ్ చదివి కూలీలవుతున్నారని, దీనికి ప్రభుత్వ విధానాలకే కారణమని జేపీ అన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా విశాఖ శంర్యాంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో మంచి చదువు వస్తుందనే భ్రమలో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ పిల్లల్ని చదివిస్తున్నారని, కానీ చాలా స్కూళ్లలో బట్టీయం తప్ప ఉపాధికి, జీవితానికి పనికొచ్చే చదువు అందటం లేదన్నారు. పాఠశాల స్థాయిలో ప్రమాణాలు లేకపోవడానికితోడు చాలా ఇంజినీరింగ్ కళాశాలలోని బోధన కూడా అధ్వాన్నంగా ఉండటంతో నైపుణ్యంలేని యువత పెరుగుతున్నారన్నారు. ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగం తరహాలో తెలుగు రాష్ట్రాలు తయారవుతున్నాయన్నారు. ఈ వాస్తవాల్ని చర్చనీయాంశాలు చేసి పరిష్కారాలపై విద్యార్థులు, తల్లిదండ్రులలో అవగాహన కల్పించేందుకే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ జవాబిచ్చారు. స్పష్టమైన పరిష్కారాలతో సమస్యల మీద ఎవరిస్థాయిలో వారు పోరాటం చేస్తుంటే మార్పు దానంతటదే వస్తుందని, పెద్ద మార్పులు రావటంలేదే అని నిరాశతో ఉంటే ఎన్ని దశాబ్దాలైనా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు ప్రసాదరావు, రవికుమార్, వైబీఐ, లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

# సురాజ్య పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలి





సురాజ్య పాలన సాధన కోసం లోక్‌సత్తా చేస్తున్న దీర్ఘకాలిక ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జేపీ పిలుపునిచ్చారు. సురాజ్య యాత్రలో భాగంగా విశాఖ రామకృష్ణా బీచ్‌లో ఆయన మార్నింగ్‌వాక్ చేస్తూ ప్రజలను పలకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖాముఖి అభిప్రాయాలను పంచుకున్నారు. సురాజ్య పాలన కోసం చేస్తున్న ఉద్యమంలో యువత, పౌరులు పార్టీలకతీతంగా భాగస్వాములవటానికి 'యూత్ ఫర్ బెటర్ ఇండియా.డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' అనే రెండు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలను అందుబాటులోకి తెచ్చామని, వీటిలో సభ్యులుగా చేరి చుట్టూ ఉన్న చిన్న సమస్యలపై సంఘటిత పోరాటం చేస్తూ పరిష్కారాలు సాధించుకోవచ్చని వివరించారు. కుల,మత,వర్గ రాజకీయాలను మార్చేందుకు పోరాడుతున్నామన్నారు. రాష్ట్రంలో, దేశంలో పార్టీల రాజకీయాలే తప్ప పాలకులు మనకేం చేస్తున్నారనే ఆలోచనే ప్రజల్లో కరవైందన్నారు. మన పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయని, కానీ అభివృద్ధి మాత్రం కనిపించటం లేదని అన్నారు. వీటన్నిటిపై ప్రజల్లో అవగాహన పెంచి, దేశంలో మార్పును వేగవంతం చేసే ఉద్యమానికి సురాజ్య రూపంలో లోక్‌సత్తా శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా యువత పెద్దఎత్తున ఇందులో భాగస్వాములు కావాలని జేపీ కోరారు. వైబీఐ నేతలు వి.హరిగణేష్, శివ, లోక్‌సత్తా నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తుమ్మపాల కర్మాగారం రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: జేపీ





తుమ్మపాల చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జేపీ భరోసా ఇచ్చారు. సురాజ్య యాత్రలో భాగంగా విశాఖ జిల్లా తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిర్వహించిన సమావేశంలో రైతులు, కార్మికుల సమస్యలను, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, ఫ్యాక్టరీ జీతాలు చెల్లించకపోవటంతో పలువురు కార్మికులు పస్తులు పడుతున్నారని, ఇప్పటికే 18మంది మృతి చెందారని తెలిపారు. కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా యన్నారు. మా బాధల్ని ఎవరూ పట్టించుకోవటం లేదని జేపీతో గోడు వెళ్లబోసుకున్నారు. తక్షణమే ఫ్యాక్టరీని ఆధునీకరించాలని, కార్మికుల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు రావాల్సిన బకాయిలు ఇంతవరకూ చెల్లించలేదని రైతులు, రైతు సంఘాల నాయకులు తెలిపారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014-15 సీజన్ నుంచి క్రషింగ్ జరగకపోవడంతో చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ప్రాంతంలో పండిస్తున్న చెరకును ఏమి చేసుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వివరించారు. అలాగే ఫ్యాక్టరీని ఆధునీకరించి సహకార రంగంలోనే కొనసాగేలా చూడాలని, ప్రైవేటు పరం చేయవద్దని కోరారు.

అనంతరం జేపీ మాట్లాడుతూ.. ఇక్కడ విన్న సమస్య లన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. అలాగే కష్టాల్లో ఉన్న కర్మాగారానికి ఆప్కాబ్ ఎందుకు రుణం మంజూరు చేయలేదో సంబంధిత అధికారులతో చర్చించి రుణం మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘాల్లో రాజకీయ పెత్తనం వల్ల పచ్చగా ఉన్న చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయన్నారు. తుమ్మపాల ఫ్యాక్టరీ విషయంలో రైతులకు, కార్మికులకు తగిన న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

కార్యక్రమంలో కోరిబిల్లి శంకరరావు, కనిశెట్టి సురేష్‌బాబు, బద్రీ, షీలా బుజ్జి, జాజుల రమేష్, సూదికొండ మాణిక్యాలరావు, భరణికాన రమణ, దొరబాబు, రైతులు, కార్మికులు, వైబీఐ, లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

## తెలుగుకు సాధికారత కోసం చొరవ తీసుకోండి



తెలుగు రాష్ట్రాల్లో తెలుగుకు సాధికారత ఉండాలని, ఈ విషయంలో చొరవ తీసుకోవాలని రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్ ఏపీ కన్వీనర్ నగర ప్రకాశరావు జేపీకి సురాజ్య యాత్రలో విజ్ఞాపన పత్రం అందించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచీ తెలుగు అధికార భాష కావాలన్నారు. చిన్నారులు బడిలో అడుగుపెట్టిన నాటి నుంచి పరభాషలో చదువు కోవటం వల్ల వికాసం కుంటుపడుతుందన్నారు. జాతి శ్రేయస్సు దృష్ట్యా మన మాతృభాషను పరిరక్షించే కార్యక్రమాలను కూడా చేపట్టాలని జేపీని కోరారు.

# ఆరిలోవ జేపీ.. యువత, విద్యార్థులు, మహిళలతో మమేకం






విశాఖ నగరంలోని ఆరిలోవలో జేపీ సురాజ్య యాత్రలో భాగంగా విద్యార్థులు, యువత, మహిళలతో మమేకమయ్యారు. సమస్యలను తెలుసుకుంటూ, చర్చిస్తూ, పరిష్కారాలు సూచిస్తూ కలియదిరిగారు.

దీన్‌దయాళ్‌పురంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులతో జేపీ సమావేశమయ్యారు. వారి వివరాల్ని, కోర్సుల గురించిన సమాచారాన్ని, సమస్యల్ని తెలుసుకున్నారు. వారంతా ఐటీఐ విద్యార్థులు. నైపుణ్యాభివృద్ధి సంస్థలో నేర్చుకుంటున్న విషయాల పట్ల జేపీ ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఈ స్కిల్స్ అన్నీ అంతకుముందు చదువులో భాగమేనని, వారంతా ఐటీఐ చదువుతున్నప్పుడు ఇవన్నీ ఎందుకు నేర్పించలేదని ప్రశ్నించారు. దీనివల్ల విద్యార్థులకు అపారంగా సమయం, తల్లిదండ్రులకు నిధులు వృధా అవుతున్నాయన్నారు. పాలకులు ఒకేపనిని మళ్లీమళ్లీ అసమర్థంగా చేస్తూ ప్రజలకేదో చేస్తున్నట్టు నటించటం తప్ప ఇది నిజమైన పాలన కాదని అన్నారు. నలుగురిలో బెరుకులేకుండా చెప్పదలచుకున్నది సూటిగా చెప్పటాన్ని అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలియని విషయాలను నేర్చుకుంటూ నిత్యవిద్యార్థిలా వ్యవహరిస్తుండాలని హితవు పలికారు. యువతే సమాజానికి తరగని ఆస్తి అన్నారు. యువత సక్రమంగా ఉంటేనే రేపటి రాష్ట్రం, దేశం సరైనరీతిలో ఉంటాయన్నారు.

అనంతరం ఆరిలోవలోని అమెరికన్ ఆస్పత్రిని సందర్శించి వైద్య సదుపాయాల గురించి జేపీ ఆరాతీశారు.

**రాజకీయాల్లో మహిళలకు తగిన ప్రోత్సాహం లేదు**

ఆరిలోవలోని విశాఖ మహిళా మండలిని జేపీ సందర్శించారు. స్వయంఉపాధి కార్యక్రమాల ద్వారా వారు సంపాదిస్తున్న ఆదాయం, ఎదురవుతున్న సమస్యల గురించి చర్చించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నా, రాజకీయాలలో మాత్రం వారికి తగిన ప్రోత్సాహం కరవైందన్నారు. ఇంత ఎనర్జీని, అవగాహనను ప్రదర్శిస్తున్నవారు సమాజం గురించి కూడా కొంత పట్టించుకుంటే జనం జీవితాల్లో మార్పు తేగల రాజకీయం కూడా కచ్చితంగా వస్తుందన్నారు.



**తోటగరువులో హైస్కూలులో జేపీ మాస్టారుగా..**

తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జేపీ పాఠాలు బోధించారు. జేపీ మాస్టారు బోధించిన సైన్స్, లెక్కలు పాఠాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పక్కకు తలతిప్పి వేరే విషయాలపైకి ధ్యాస మళ్లించటానికి వీల్లేనంత వేగంగా ఆలోచింప చేస్తూ విద్యార్థులకు బుర్రలకు జేపీ పదును పెట్టారు. గర్భంలోని పిండం ఎందువల్ల పిల్లగా మారుతుంది, అవే క్రోమోజోమ్‌ల కాంబినేషన్‌లో ఏ రకమైన మార్పు వల్ల పిల్లాడుగా రూపుదిద్దుకుంటుంది, స్త్రీ శిశువులు పుట్టటానికి చాలామంది భ్రమపడుతున్నట్టు మహిళలే కారణమా వంటి అంశాలను జేపీ ప్రశ్నల ద్వారా విద్యార్థులకు వివరించారు. అలాగే లెక్కల్లో లాగరిథమ్స్, మెనున్సురేషన్ గురించి చెప్పారు. విద్యాప్రమాణాల విషయంలో మనం ఎందుకు అట్టడుగున ఉన్నామో ఉపాధ్యాయులు, విద్యార్థులతో చర్చించి సూచనలిచ్చారు.

# ప్రభుత్వ విద్యావ్యవస్థను కడిగేసిన యూత్ అసెంబ్లీ




దేశాభివృద్ధికి కీలకమైన విద్యారంగంలో ఎన్డీయే ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జేపీ అన్నారు. యువతకు ఎదిగే అవకాశాలను, ఆదాయాన్ని అందించటంలో కీలకమైన విద్యను బాగుచేయకుండా.. మీరు ఏరకమైన అభివృద్ధిని సాధిస్తున్నట్టు? అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ ప్లాటినం జూబ్లీ హాల్‌లో 'పాఠశాల విద్యలో సంస్కరణలు'పై నిర్వహించిన యూత్ మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో.. సురాజ్య యాత్రలో భాగంగా జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధి గురించి ఒక్కసారి కూడా పార్లమెంటులో చర్చించలేదని జేపీ ఈ సందర్భంగా అన్నారు. మనదేశ నాయకులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతాన్ని తగ్గించాలని అడుగుతున్నారేతప్ప, పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మాత్రం కోరడం లేదన్నారు. ఏడాదికి ఒక్కో విద్యార్థిపై రూ.50వేల వరకూ ఖర్చు చేస్తున్నా ఫలితాలు రావడం లేదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి ర్యాంకులు రావాలని కోరుకుంటున్నారే తప్ప.. విజ్ఞానవంతురాలు, విజ్ఞానవంతుడు కావాలని కోరుకోవడం లేదన్నారు. వారి కోరిక మేరకే చాలా ప్రైవేటు స్కూల్స్‌లో ర్యాంకుల యాంత్రిక బోధన జరుగుతోందన్నారు.

అధికార, ప్రతిపక్ష పార్టీలుగా ఈ అసెంబ్లీలో రెండు పాత్రల్ని పోషించిన యువత.. విద్యావ్యవస్థలో లోపాల్ని తీవ్రంగా ప్రశ్నించింది. ముఖ్యంగా ప్రతిపక్షంలోనివారు ఆలోచింపచేసేలా, ఆసక్తికరంగా ప్రశ్నలు సంధించారు. ప్రజలకు అవసరం లేని వాటికి కూడా సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు నిధుల్ని కేటాయిస్తూ వారిని సోమరులుగా, నిరంతరం ప్రభుత్వం మీద ఆధారపడేవారుగా తయారుచేస్తున్నాయని, ఆ డబ్బునంతా విద్యారంగానికి కేటాయిస్తే మార్పు రాదా? అని ప్రతిపక్ష నేత ఐజాక్ శ్రీను నిలదీశారు. అక్షరాస్యతను పెంచటానికి, విద్యాప్రమాణాలను పెంచటానికి, విద్యతోపాటు శారీరక దారుఢ్యం, క్రీడలలో ప్రావీణ్యతను పెంచటానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు అని లేవనెత్తిన ప్రశ్నలు ఆలోచింపచేశాయి. దీనికి ముఖ్యమంత్రి ప్రతాప్‌కుమార్ బదులిస్తూ, సింగపూర్ నమూనాలో ప్రజాసంక్షేమం కోసం రాత్రీపగలు కష్టపడుతున్నామని చెప్పారు. కమిటీలు వేసి సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు.

ప్రైవేటు స్కూళ్లు, రిజర్వేషన్లతో నియామకాలు వంటి అంశాలపై వాదోపవాదాలు జరిగాయి. విద్యామంత్రి యోగిత మాట్లాడుతూ, టీచర్ ట్రైనింగ్ పెట్టి జల్లెడ వేసి నైపుణ్యం ఉన్నవారిని నియమిస్తున్నా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు.

రాజ్ ముదునూరి స్పీకర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆచార్య సుధాకర్, డాక్టర్ శాంతి, భాస్కర్, ప్రకాశరావు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

**జీవితాల్ని రాజకీయాలు ప్రభావితం చేస్తాయి: మంత్రి గంటా**

రాజకీయాలు తీసుకునే నిర్ణయాలు జనం జీవితాల్ని



ప్రభావితం చేస్తాయని, అందుకే అసెంబ్లీని యువత బాధ్యతగా నిర్వహించాలని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీ నియమ నిబంధనలను అనుసరించా లన్నారు. అధికార, ప్రతిపక్షాలు, స్పీకర్ కలిసి సమస్యల పరిష్కారానికి, రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే విధంగా అసెంబ్లీని నిర్వహించాలన్నారు. మొదటిసారిగా విద్యార్థులు పాఠశాల విద్యను ప్రధానాంశంగా తీసుకుని యూత్ అసెంబ్లీని నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రభుత్వానికి ఆలోచన కలిగించే విధంగా సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తయారుచేసి పంపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల లేమి తదితర అంశాలను గురించి తెలియచేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్, మొబైల్ యాప్, ఆన్‌లైన్ ఏర్పాట్లు ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఏటా రూ. 23,209 కోట్ల దాకా విద్యారంగానికి ఖర్చు చేస్తోందన్నారు. నాణ్యత, విలువలు కలిగిన విద్యను అందించేందుకు రూ. 4,850కోట్లతో మోడల్ స్కూళ్లను ప్రారంభించనున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎథిక్స్ కౌన్సిల్, వర్చువల్ క్లాసులు కూడా అమలుచేస్తామన్నారు. టీచర్స్, స్టూడెంట్స్ నిష్పత్తి సక్రమంగా ఉండటం కోసం అవసరమైతే మరో డీఎస్సీ నిర్వహించేందుకు కూడా సిద్ధమన్నారు.

**ప్రభుత్వ లోపాలను కంక్లూజన్ పేపర్‌లో ఇవ్వాలి: ఎంపీ కంభంపాటి హరిబాబు**

విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ, ప్రాథమిక విద్యపై వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, నాణ్యమైన విద్య కోసం ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో నమోదు తగ్గకుండా ప్రైవేటుకు దీటుగా మౌలిక వసతుల్ని కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ. 3.25కోట్ల వ్యయంతో ప్రభుత్వ రంగ సంస్థలు బెంచీలు సమకూర్చాయన్నారు. ఎన్నారైల సహకారంతో డిజిటల్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేసి అధునాతన బోధనా పద్ధతుల్ని సమకూరుస్తున్నట్టు చెప్పారు. 144 మునిసిపల్ పాఠశాలల్లో రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచటానికి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో రూ. 550కోట్లతో మెగా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించటానికి ఇప్పుడున్న వ్యవస్థలో ఎలాంటి లోపాలున్నాయో, ఎలా సరిచేయాలో ప్రభుత్వానికి తెలియచేస్తూ కంక్లూజన్ పేపర్‌ని ఇవ్వాలని సభను కోరారు.

**చదువుతోపాటు యవత సామాజిక రంగాల్లో పనిచేయాలి: జేపీ**

చదువులు బాగుచేస్తామని ఉపన్యాసాలిస్తే చాలదని, పాఠశాల విద్యలో 74 దేశాల మధ్య సర్వేలో మనదేశం 73వ స్థానంలో ఉందని జేపీ గుర్తుచేశారు. ప్రైవేటు సంస్థల ఫీజుల కంటే ఎక్కువ ఖర్చు చేస్తున్నా ప్రభుత్వ స్కూళ్లు ఎందుకు అధ్వాన్నంగా ఉన్నాయో పాలకులు విశ్లేషించాలన్నారు. నైపుణ్యాలను విద్యలో భాగంగా చేయటం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. యువత చదువుతో పాటు సామాజిక రంగాల్లో పనిచేయాల్సిన అవసరం ఉందని, అప్పుడే నిజమైన సామాజిక మార్పులు ఎప్పకప్పుడు వస్తూ ప్రజాస్వామ్యం పరిపుష్టమవుతుందన్నారు.

# మారికవలస నుంచే ఆదర్శ కాలనీ కార్యక్రమాన్ని చేపట్టవచ్చు

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా విశాఖ మధురవాడ వద్దనున్న మారికివలస జేఎన్ఎన్‌యుఆర్ఎం భవనాలను జేపీ పరిశీలించారు. అక్కడి ప్రజలతో సమస్యల గురించి చర్చించారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు పెరుగుతున్నా కాలనీలను, బస్తీలను బాగుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించటం లేదన్నారు. కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించవచ్చన్నారు. చెత్త నిర్వహణను ఏ వార్డుకు ఆ వార్డులోనే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతిలో వికేంద్రీకరించాలన్నారు.

# దివాళా అంటూనే దుబారా చేస్తున్నారు

ఒకపక్క రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభమంటూనే మరోపక్క ప్రభుత్వం ఇష్టమొచ్చినట్టు దుబారా ఖర్చులు చేస్తోంది.. ఇది దురదృష్టకరం అని జేపీ అన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా దేవరాపల్లికి వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రతి విద్యార్థి పాఠశాల చదువుకూ ఏటా రూ.60,000 ఖర్చు చేస్తున్నామని ఆ శాఖ మంత్రే చెబుతున్నారని, మరి ప్రభుత్వ పాఠశాలలో చేరాల్సిన విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో ఎందుకు చేరుతున్నారని జేపీ ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువెందుకు బాగా లేదో అధ్యయనం చేయాల్సిన, తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికుందన్నారు. సర్కారు బడుల పనితీరు పట్ల ప్రభుత్వానికి శ్రద్ధ లేకపోవడం వల్లే, పర్యవేక్షణ కొరవడటం వల్లే నిధులు కేటాయిస్తున్నా ఫలితాలు రావటం లేదన్నారు. విద్యారంగ సమస్యలపై వేసిన ఒక్క కమిటీ నివేదికైనా వెలుగు చూసిందా? ప్రభుత్వం అమలు చేసిందా? అని నిలదీశారు. పన్నుల రూపంలో వచ్చే ఆదాయంతో రూపొందించే కేంద్రబడ్జెట్ రూ.21.40 లక్షల కోట్లలో రాష్ట్రాలకు 52శాతం ప్రాతిపదికన రూ.10.85లక్షల కోట్లు విడుదలవుతున్నాయని, వాటిలో ఎంత మేర రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాలకు కేటాయిస్తున్నాయో చెప్పాలని జేపీ అన్నారు. రాష్ట్రం నుంచి పంచాయతీలకు ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో ప్రజలకు తెలియాలన్నారు. కేంద్ర నిధులు తప్ప రాష్ట్రం సగటున మనిషికి ఒక్క పైసా కూడా విడుదల చేయటం లేదన్నారు. నిధులను నేరుగా గ్రామాలకు కేటాయిస్తే.. ప్రజలే వారి సమస్యలను పరిష్కరించుకుంటారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలోనూ అవినీతి తాండవిస్తోందన్నారు.



అనారోగ్య సమస్యలతో దేశంలో ఏటా 6 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారని, ఏపీలో ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయిస్తున్న దానికి అదనంగా రూ.2,000కోట్లు ఖర్చు చేస్తే 98శాతం మందికి మంచి ఆరోగ్యాన్ని భారం లేకుండానే అందించవచ్చన్నారు. విశాఖ నగరంలో విమ్స్ వంటి ఖరీదైన ఆసుపత్రిని నిర్మించి వైద్య సిబ్బందిని నియమించకపోతే ఆ హాస్పిటల్ వల్ల ఒరిగేదేమిటని ప్రశ్నించారు. పోలవరంపై ప్రభుత్వం ఆలస్యంగా మేలుకొందని, ఇప్పుడు యుద్ధప్రాతిపదికన నిర్మాణాన్ని పూర్తి చేయటానికి ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రకృతి అనుకూలిస్తే వచ్చే ఏడాదిలోగా పూర్తికావచ్చన్నారు. ఈ అంతర్రాష్ట్ర బహుళార్థ సాధక ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర ప్రజలకు తాగు, సాగునీటికి సంబంధించి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా జిల్లా కన్వీనర్ వేణుగోపాల్, లెక్కల శ్రీనివాస్, సుభాషిణి, కోటపాడు యువనేత సంతోష్, వైకాపా యువజన విభాగం నేత చల్లా ఎర్రునాయుడు, సన్యాసినాయుడు, ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పీపీ రావు మృతి రాజ్యాంగానికి, పౌరహక్కులకు తీరని లోటు

లోక్‌సత్తా సాధించిన కొన్ని కీలక సంస్కరణల్లో పీపీ రావు (పవని పరమేశ్వరరావు) భాగస్వాములని, ఆయన మృతి భారత రాజ్యాంగానికి, పౌరహక్కులకు తీరనిలోటని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. ఎన్నికల్లో పోటీచేసేవారు నేరచరిత్ర వివరాలను తప్పనిసరిగా వెల్లడించే చట్టబద్ధ ఏర్పాటు కోసం లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నాన్ని ఆర్డినెన్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు అడ్డుకుంటే.. లోక్‌సత్తా వాదనల్ని పీపీరావు సుప్రీంకోర్టులో బలంగా వాదించారని జేపీ గుర్తుచేసుకున్నారు. అభ్యర్థులు తమ వివరాల్ని వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆ కేసులో ఇచ్చిన తీర్పు (2003) వల్లే ఇప్పుడు నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఆస్తులు సహా అన్ని వివరాల్నీ వెల్లడించాల్సి వస్తోందన్నారు. అలాగే రైతులకు, కౌలురైతులకు ఎంతో మేలు చేసే పరస్పర సహాయ సహకార సంఘాల (మ్యాక్స్) చట్టాన్ని రద్దు చేసి పాల డెయిరీలను గుప్పెట్లోకి తీసుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు హైకోర్టులో, సుప్రీంకోర్టులో లోక్‌సత్తా తరపున పీపీ రావు వాదించారని, ఆ ప్రజావ్యతిరేక చర్యల్ని నిరోధించటానికి తోడ్పడ్డారని అన్నారు (ముఖ్యమంత్రి కార్యదర్శిగా జేపీ ఇచ్చిన సూచన మేరకే ఎన్టీరామారావు 1995లో మ్యాక్స్ చట్టాన్ని తీసుకొచ్చారు). ప్రజలు పరస్పర సహకారంతో సంఘాలుగా ఏర్పడి స్వతంత్రంగా కార్యకలాపాలు నిర్వహించుకోవడం ప్రాథమిక హక్కులో భాగమేనని ఆ తర్వాత 2012లో లోక్‌సత్తా చరిత్రాత్మక 97వ రాజ్యాంగ సవరణను సాధించిందన్నారు. తన సుఖాన్ని, సమాజహితాన్ని సంధానం చేసుకుంటూ నిరాడంబరంగా జీవించిన పీపీరావు ఎందరికో ఆదర్శమంటూ, ఆయన కుటుంబ సభ్యులకు జేపీ ప్రగాఢ సంతాపం తెలిపారు.





# పార్టీలకతీతంగా సమస్యలపై పోరాటం చేద్దాం

మనలో ప్రతి ఒక్కరికీ సమస్యలుంటాయని, సమస్యలకు సరైన పరిష్కారాలను వెతక్కుండా కాలక్షేపం చేస్తుంటే ఎన్నేళ్లు గడిచినా బతుకులు బాగుపడవని జేపీ అన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా విశాఖ జిల్లా కె.కోటపాడు మండలం మీదుగా పర్యటిస్తూ కె.సంతపాలెం రైతుబజార్‌ను ఆయన సందర్శించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు గిట్టుబాటు ధరల కోసం, కౌలురైతులు తమ మనుగడ కోసం, విద్యార్థులు భవిష్యత్తు కోసం, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం, బీసీలు, దళితులు తమ భవిష్యత్తు కోసం ఆలోచనలు చేస్తున్నారని జేపీ అన్నారు. వీటన్నింటినీ పరిష్కరించాలంటే రాజకీయాలకు అతీతంగా సానుకూలంగా నడవాల్సిన అవసరం ఉందన్నారు. అందరి సమస్యలనూ గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే సురాజ్య ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్కడి రైతులు, ఇతర వర్గాల ప్రజల సమస్యలను జేపీ అడిగి తెలుసుకున్నారు.

నష్టాల సాగు ప్రభుత్వ పుణ్యమేనని జేపీ ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలు రైతులకు ఆదాయం వచ్చే మార్గాల మీద దృష్టి పెడితేనే పరిష్కారం మొదలవుతుందన్నారు. టమాటా, ఉల్లి వంటి పంటలు ఎక్కువ కాలం నిల్వ ఉండవని, వీటిని రైతులు ఎంతోకొంత ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజార్ల వద్ద కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేస్తే ఈ సమస్యను అధిగమించవచ్చన్నారు. బ్యాంకుల్లో కొంతమంది రైతులకే రుణాలిస్తున్నారని, మిగిలిన వారు అధికవడ్డీకి ప్రైవేటు అప్పులు తెచ్చుకుంటున్నారని, రుణమాఫీ ఎంతమంది రైతుల కోసమని ప్రశ్నించారు.

సుజల స్రవంతితో సూదివలస ప్రాంతంలో భూదేవి రిజర్వాయర్ నిర్మాణం వల్ల తమ గ్రామాల్లో పంటపొలాలకు ముప్పు వాటిల్లిందని కె.సంతపాలెం సర్పంచి చల్లా తులసి జేపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందిస్తూ.. పూర్తి వివరాలను ఇవ్వాలని జేపీ కోరారు. భూదేవి రిజర్వాయర్ వల్ల ఎంతమంది రైతులకు నష్టం వాటిల్లుతుంది? ఎంత నష్టపరిహారం అందాలి? తదితర అంశాలపై అధ్యయనం చేస్తామన్నారు. ఈ సందర్భంగా భూదేవి రిజర్వాయర్ మ్యాప్‌ని పరిశీలించారు. ప్రత్యామ్నాయ పరిష్కారాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జేపీ ఆమెకు హామీ ఇచ్చారు. సంతపాలెం రైతుబజార్‌లో షెడ్లు నిర్మించాలని సూచించారు.

కాశీపురంలో మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ జేపీని కలిసి శాలువా కప్పి సత్కరించారు. రైవాడ గట్టుపై వెళ్లే సరైన దారి లేకపోవడంతో భీశెట్టి బాబ్జీతో ద్విచక్ర వాహనంపై వెళ్లి జలాశయాన్ని జేపీ సందర్శించారు.





# యువతకు స్పష్టత ఉంటే.. మార్పు తన్నుకుంటూ వచ్చేస్తుంది

గర్వించే భారతదేశాన్ని తయారుచేసుకోవాలంటే నిర్దిష్టవిధానాలు కావాలని, వీటిని సాధించేందుకు కార్యాచరణ కావాలని జేపీ అన్నారు. చిన్న చిన్న పనులు చేస్తూనే పెద్ద ఫలితాల్ని ఎలా సాధించవచ్చో వివరించారు. యువతకు స్పష్టత, చుట్టూ ఉన్న చిన్న చిన్న సమస్యల్ని పట్టించుకునే సామాజిక స్పృహ, క్రమం తప్పకుండా పనిచేసే క్రమశిక్షణ ఉంటే చాలు.. రాష్ట్రంలో, దేశంలో మంచి మార్పు తన్నుకుంటూ వచ్చేస్తుందని అన్నారు.

సురాజ్య యాత్రలో భాగంగా అనకాపల్లి డైట్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులు, అధ్యాపకులతో జరిగిన చర్చావేదికలో జేపీ ప్రసంగించారు. పరిష్కారాలను చర్చించారు.

దేశ ప్రజలు, ముఖ్యంగా యువత ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని జేపీ సూచించారు. యువత స్పందించే తీరు మీదే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ అనే వెబ్ ప్లాట్‌ఫారాల సాయంతో తాను సురాజ్య యాత్రను చేపట్టానని, వీటిలో పేర్లు నమోదు చేసుకుని యువత ఎవరి పెత్తనమూ లేకుండానే సరైన అవగాహనతో తమ స్థానిక సమస్యల్ని సమష్టిగా పరిష్కరించుకోవచ్చని వివరించారు.

ఏదైనా విషయంలో మనకు హేతుబద్ధంగా స్పష్టత వచ్చాక.. ప్రభుత్వాలు ఆ రీతిలో పనులు చేస్తున్నాయా, లేదా అని పరిశీలించి ప్రశ్నించటమే దేశభక్తి అని, మన రోజువారీ జీవితాల్ని బాగుచేసుకోవటాన్ని మించిన రాజకీయం ఉండదని జేపీ అన్నారు. దేశం కోసం సొంతంగా ఆలోచించి సమస్యను పరిష్కరించే దిశగా యువత ఎదగాలని కోరారు. దేశంలో ఆరోగ్య సమస్యల వల్ల ఏటా 6 కోట్లమంది ప్రజలు పేదరికంలోకి జారిపోతున్నారన్నారు. ఈ సంఖ్య బ్రిటన్ దేశ జనాభాతో సమానమన్నారు.

వ్యవసాయంలో ప్రభుత్వ విధానాలు, పాలు, ఆహారధాన్యాలలో కల్తీని అరికట్టటం, లంచగొండితనాన్ని నిరోధించటం, అందరికీ విద్య, వసతి సదుపాయాలు, ఆరోగ్యం అందించే మార్గాల గురించి అడిగిన ప్రశ్నలకు జేపీ వివరంగా సమాధానాలిచ్చారు. డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) వల్ల ఆంధ్రప్రదేశ్‌కు, దేశానికి జరిగిన లాభం, నష్టం, డిజిటలైజేషన్ అనేది నిరక్షరాస్యులకు చేరటం తదితర అంశాలపై సంధించిన పలు ప్రశ్నలకు జవాబిచ్చారు. విదేశాల్లోని నల్లధనాన్ని తిరిగి రప్పించటం కష్టమని, అయితే దేశం నుంచి ఏటా తరలిపోతున్న 5లక్షల కోట్ల నల్లధనాన్ని ఆపితే చాలని అన్నారు.

విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంచుతూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ జేపీ సమాధానాలిచ్చారు.

స్వచ్ఛభారత్ మంచి కార్యక్రమమని, అయితే రూపకల్పన సక్రమంగా లేకపోవడం వల్ల అమలు తక్కువ, ప్రచారం ఎక్కువ అయిందని ఓ ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు.

కార్యక్రమంలో యూత్ ఫర్ బెటర్ ఇండియా ప్రతినిధులు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, వైస్ ప్రిన్సిపల్ అమరేంద్ర, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





# రైవాడ రైతులను మోసం చేస్తే.. ముందుండి పోరాడతా: జేపీ



రైవాడ రైతన్నలు ఇక అధైర్యపడాల్సిన పనిలేదని, పోలవరం పూర్తయితే రైవాడ జలాశయం నీరు పూర్తిగా రైతులకే చెందుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ఒకవేళ ప్రభుత్వం రైతుల్ని మరోసారి మోసం చేయాలని చూస్తే రైతుల పక్షాన తానే ముందుండి పోరాడతానని భరోసా ఇచ్చారు. జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా ఆయన విశాఖ జిల్లాలోని రైవాడ జలాశయాన్ని, మారికగెడ్డ నిర్మాణం చేసే స్థలాన్ని సందర్శించారు.


రైవాడ జలాశయం, మారికగెడ్డ వివరాలను రైతులనడిగి జేపీ తెలుసుకున్నారు. వారు చెప్పిన వివరాలు సరిగా లేకపోవడంతో తాను వెంట తెచ్చుకున్న సమాచారాన్ని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. రైవాడ జలాశయం నుంచి సాగునీరు ప్రస్తుతం అందిస్తున్న 15,344 ఎకరాలతోపాటు అదనపు ఆయకట్టు ఆరువేల ఎకరాలకు నీరందించేందుకు సరిపడా జలశయాన్ని నిర్మించారన్నారు. అనంతరం కాశీపురం నుంచి ఆనందపురం, నాగియ్యపేట, సీతంపేట, దేవరాపల్లి గ్రామాల మీదుగా పర్యటించి రైతులతో వారి సమస్యలను తెలుసుకున్నారు. దేవరాపల్లిలో నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జేపీ నివాళులర్పించారు. అనంతరం ఉమామహేశ్వరీదేవి గుడి ప్రాంగణంలో మల్లికార్జున వారాడ నారాయణమూర్తి ఆయకట్టుదారుల సాధన కమిటీ ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పాల్గని ప్రసంగించారు. సాధన కమిటీ అధ్యక్షుడు వేచలపు చినరామునాయుడు అధ్యక్షత వహించారు.

జేపీ మాట్లాడుతూ, అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నీటిపారుదలకు, విద్యుత్‌కు పెద్దపీట వేశారన్నారు. ఆయన కృషి ఫలితమే రైవాడ లాంటి జలాశయాలని, వాటి ఫలాలు ఇప్పుడు అందరికీ అందుతున్నాయని అన్నారు. పోలవరం పూర్తయితే రైవాడ, ఏలేరు, తాటిపూడి రైతాంగానికి పూర్తి విముక్తి కలుగుతుందని, ఈ సమస్య గురించి ఆలోచించకుండా రైతులు ధైర్యంగా ఉండాలని అన్నారు. ప్రతీ రైతు వరి, చెరకుతోపాటు ఉద్యానవన పంటలపైపు మొగ్గు చూపి ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలన్నారు. జనం గొంతు కలిపితే ప్రతీ సమస్య పరిష్కారమూ సాధ్యమవుతుందన్నారు. ప్రజల బతుకులు మారాలంటే యువత ముందుకు రావాలన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తేనే ప్రజలకు మనుగడ ఉంటుందన్నారు. ప్రజాసమస్యలు పట్టని ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలన్నారు. కులవివక్ష, రైతు పట్ల వివక్ష స్వతంత్ర భారతదేశాన్ని తీవ్రంగా కుంగదీస్తున్నా యన్నారు. కౌలురైతుకు జరుగుతున్న అన్యాయం ప్రకృతి శాపం వల్ల కాదని, పాలకుల పాపం వల్లేనని అన్నారు. పంటలకు న్యాయమైన ధర ఇవ్వకున్నా, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు మంచి విద్య, ఆరోగ్యం వంటి విధానాలను చేపట్టకపోయినా దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు పెనుసంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

చినరామునాయుడు మాట్లాడుతూ, 1986 నుంచి జరుగుతున్న రైవాడ రైతుల ఉద్యమాన్ని నీరుగార్చుతున్న పాలకులకు కనువిప్పు కలిగేలా జేపీ సహకారంతో పోరాడతామన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా నేతలు భీశెట్టి బాబ్జీ, లెక్కల శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఆదిరెడ్డి చిన కన్నబాబు, ఆవుగడ్డ అప్పలనాయుడు, సీపీఐ నాయకులు వేమల కన్నబాబు, కాసుబాబు, లోక్‌సత్తా విజయనగరం, విశాఖపట్నం నేతలు, బండారు రామ్మోహనరావు, ఝాన్సీ లక్ష్మి తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# మార్పు తప్ప నాకు ఇంకేం అవసరం లేదు, మనదేశాన్ని మనమే మార్చుకోవాలి: జేపీ



దేశంలో సరైన మార్పు తప్ప తనకు ఇంకేమీ అవసరం లేదని, మనదేశంలో మార్పుని మనమే సాధించుకోవాలని జేపీ అన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా అనకాపల్లి వివేకానంద చారిటబుల్ హాల్‌లో చిన్న, సన్నకారు రైతులు, సంఘాల నాయకులు, డ్వాక్రా మహిళలతో ఆయన మాట్లాడారు.

వ్యవసాయ ఉత్పత్తులకు న్యాయమైన ధరలు రాకపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలే కారణమని జేపీ అన్నారు. అసమర్థంగా అమలుచేసిన పెద్ద నోట్ల రద్దు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ పడిపోవడం ఆర్థిక సంక్షోభానికి కారణాలన్నారు. పది మిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను కేంద్రం నిలిపివేసిందని, ఇదే సమయంలో మరో 10 మిలియన్ డాలర్ల విలువైన పప్పులు, వంటనూనెలు వంటి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతించిందని విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల లక్షా 30వేల కోట్ల రూపాయల రైతుల ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయని వాపోయారు. మనం మన పంటల్ని వదిలి విదేశీ రైతుల వద్ద నుంచి పంటలను దిగుమతి చేసుకుని అక్కడి వారిని పోషిస్తున్నామన్నారు. గత యూపీయే ప్రభుత్వ హయాంలో ఆహార గిడ్డంగుల్లో 8కోట్ల టన్నుల ధాన్యాలు మూలుగుతున్నప్పటికీ ఎగుమతులను నిషేధించారని ధ్వజమెత్తారు. లోక్‌సత్తా ఈ సమస్యను లేవనెత్తి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లిందని, దీంతో ఆయన సమస్యను పరిష్కరించారని వివరించారు.

అనంతరం రైతులు, డ్వాక్రా మహిళలతో మాట్లాడి వారి సమస్యలను జేపీ తెలుసుకున్నారు.

రైతు సంఘం నాయకుడు విల్లూరి రాము మాట్లాడుతూ, గిట్టుబాటు ధరలు లభించేలా లోక్‌సత్తా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ఉద్యమాలను ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని సీపీఎం నాయకుడు ఎ.బాలకృష్ణ అన్నారు.

వినియోగదారుడికి నష్టం లేకుండానే రైతు పండించే పంటకు సరైన ధర రావటం పూర్తిగా సాధ్యమని, అయితే దీనికి పైపై చర్చలు, ఉత్తుత్తి నినాదాలు చాలవని జేపీ స్పష్టం చేశారు. లోతైన చర్చ, రైతుల్లో స్పష్టత, ఐక్యత కావాలన్నారు. ప్రభుత్వం గోడౌన్లు ఏర్పాటు చేస్తే నిల్వ చేసిన పంటను ధర పెరిగినప్పుడు అమ్మకాలు చేసుకోవచ్చని, ఈ పనులు చేయటానికి కేవలం ప్రభుత్వానికి బుద్ధి, కాస్త మంచి మనసు ఉంటే చాలన్నారు. ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ. 50,000–60,000 ఖర్చు చేస్తున్నా చదువెందుకు రావటం లేదన్న ఇంగితం కూడా పాలకుల్లో, అధికారుల్లో కన్పించటం లేదన్నారు. పట్టాదారు పాసుపుస్తకం కావాలంటే లంచం లేకుండా అవుతుందా అని ప్రశ్నించారు. ఒక మాజీ ప్రధాని హత్య కేసులో సుమారు 18 ఏళ్ల తర్వాత తీర్పు వచ్చిందని, ఇంతకంటే మనదేశం వెనకబాటుతనానికి నిదర్శనం కావాలా? అన్నారు. ప్రస్తుత రాజకీయాలు భ్రష్టుపట్టాయని, నాయకుల కోసం కాకుండా మనకోసం మనం బతకాలని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.


స్థానిక నాయకులు జేపీకి నూకాంబికా అమ్మవారి చిత్రపటాన్ని అందచేసి అభినందించారు. కార్యక్రమంలో భీశెట్టి కృష్ణ అప్పారావు, ఎ.బాలకృష్ణ, స్వాతి, మారిశెట్టి శ్రీనివాసరావు, బాబ్జీ, బండారు రామ్మోహనరావు మాట్లాడారు. వైబీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువత అరచేతిలోనే జాతి నిర్మాణంలో భాగస్వాములయ్యే అవకాశం, యూత్ ఫర్ బెటర్ ఇండియా వెబ్ ప్లాట్‌ఫాం పోస్టర్ ఆవిష్కరణ




జాతి నిర్మాణంలో భాగస్వాములయ్యే అవకాశాన్ని యువత అరచేతిలోకే తెచ్చామని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో ఎటువంటి రుసుమూ లేకుండా నమోదై కార్యక్రమాల్లో పాల్గనాలని విద్యార్థులు, యువతీయువకులకు జేపీ పిలుపునిచ్చారు. సురాజ్య యాత్రలో భాగంగా విశాఖకు వచ్చిన జేపీ.. నగరంలోని సీతమ్మధారలో ఉన్న యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) రాష్ట్ర కార్యాలయంలో వైబీఐ వెబ్ ప్లాట్‌ఫాం పోస్టర్‌ను విడుదల చేశారు. సురాజ్యం రావాలంటే యువతే ముందుండాలన్నారు. ఆదర్శవంతమైన, ప్రతిభావంతమైన యువతకు మనదేశంలో కొదవ లేదన్నారు. కానీ వారికి సరైన దిశానిర్దేశం ఉండాలన్నారు. విద్యా సంస్కరణలు, ఉపాధి అవకాశాలు లేకపోతే భావితరాలు తీవ్రంగా నష్టపోతారన్నారు. అవినీతి, అధికారంపై ఉన్న శ్రద్ధ పాలకులకు యువతపై లేకపోవడమే సమస్యన్నారు. వైబీఐ యాప్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో వైబీఐ కన్వీనర్ కె.నరసింహారావు, సభ్యులు పాల్గొన్నారు.

# విద్య, ఆరోగ్యం పట్టించుకోని ప్రభుత్వాలెందుకు?


- జయప్రకాష్ నారాయణ

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా వెలమకొత్తూరు గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యాలను పట్టించుకునేదే నిజమైన రాజకీయం, పాలన అని, వాటిని పట్టించుకోని ప్రభుత్వాలను మనం ఎందుకు ఎన్నుకోవాలని జేపీ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో, పలు కార్యక్రమాల్లో ప్రజలు సేవకులుగా, పాలకుల బంట్లుగా ఉండే పాలన సాగుతోందన్నారు. లంచం, పెత్తందారీ వేధింపులు లేకుండా గవర్నమెంట్ ఆఫీసులు పనులు అవుతున్నాయని ఏ ఒక్కరూ చెప్పలేని పాలన నడుస్తోందన్నారు. స్వరాజ్యమయితే 70 ఏళ్ల క్రితం వచ్చిందని, కానీ.. సరిగ్గా చట్టం, న్యాయం, విద్య, ఆరోగ్యం, రైతులకు లాభసాటి వ్యవసాయం, పేదలకు మౌలిక సదుపాయాలు అందించే కనీసస్థాయి సురాజ్యం కూడా ఇప్పటికీ రాలేదని అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ పాలకులు ప్రైవేటు రంగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు.

సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలపై విద్యార్థులు అభిప్రాయాలను జేపీ తెలుసుకున్నారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులు చెప్పారు. ప్రజాధనంలో ప్రభుత్వం అమలుచేస్తున్న సేవలను వినియోగించుకోవాలని, అవినీతిని ప్రశ్నించాలని సూచించారు. విద్యార్థుల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, ప్రజల నిజమైన సమస్యలు, వాటికి నిజమైన, వెంటనే అమలు చేయగల పరిష్కారాలను అందిస్తూ సురాజ్య యాత్రను చేపట్టామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి జిల్లాలో నాలుగైదు రోజులు, ప్రజలతో లోతుగా చర్చిస్తూ కార్యక్రమం సాగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టీసీ రవిచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైబీఐ ప్రతినిధులు, లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

# లంచాలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోలేక పోతున్నాయి?



ఉద్యోగులకు మంచి జీతాలిస్తున్నారు, మనదేశంలాంటి పేదదేశంలో చాలా గొప్ప అనుకునే స్థాయిలో జీతాల్ని పెంచుతున్నారు, బోనస్‌లు, ఇతరత్రా అవకాశాల్ని అందిస్తున్నారు.. కానీ వారి లంచాలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నాయి? ఉద్యోగుల జీతాలకు, పాలకుల మనుగడకు డబ్బు ఇస్తున్న ప్రజలను లంచాల బారి నుంచి ఎందుకు విముక్తి చేయటం లేదు?.. అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ సూటిగా ప్రశ్నించారు. చాలాదేశాల్లో సాధారణంగా జరిగే మార్పులకు కూడా మన రాష్ట్రంలో, దేశంలో ఏళ్లకు ఏళ్లు పడుతోందన్నారు. విదేశాల్లో భవనాల నమూనాలు, పెట్టుబడులు అంటూ హడావుడి చేస్తున్న ముఖ్యమంత్రి.. ఆ దేశాల్లో ప్రజలకు లంచాలు లేకుండా సేవలు ఎలా అందిస్తున్నారో కనీసం గమనించటం లేదన్నారు. ప్రభుత్వాలు వెంటనే పెద్ద ఖర్చు లేకుండా చేపట్టగలిగిన ఇలాంటి మార్పుల కోసమే సురాజ్య యాత్రను చేపట్టామన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్ర విశాఖ నుంచి తూర్పు గోదావరి జిల్లాలో ప్రవేశించిన సందర్భంగా ఆయన తునిలో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసు పుస్తకం నుంచి భూమి సర్వే వరకు లంచం ఇస్తేనే పని జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజల కోసం రూ. 1.57లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నా, రోజువారీ జీవితంలో ఇప్పటికీ కనీస సేవలు అందటం లేదని, ఎంతో గొప్ప టెక్నాలజీని ఉపయోగిస్తున్నామంటున్నా లంచాలు, వేధింపులు లేని సేవలు అందటం లేదని అన్నారు. పంచాయతీలకు కేంద్రం నుంచి డబ్బు వస్తోందిగానీ, రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా ఇవ్వటం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి కనీసం రూ. 4లు కూడా ప్రజలకు ప్రత్యక్షంగా అందటం లేదన్నారు. ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య ఉన్నకొద్దీ అంతరాలు తొలిగి, పారదర్శత పెరుగుతూ అధికారాలు జనం చేతికి వెళ్తుండటం ప్రజాస్వామ్య పరిణతికి నిదర్శనమని, కానీ ఉన్నకొద్దీ అధికారాలు ముఖ్యమంత్రి కార్యాలయంలో కేంద్రీకృతమవుతూ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నాయన్నారు. జనం చేతికి అధికారాలు, నిధులు వెళ్తూ అక్కడ సరైన పర్యవేక్షణ, అవినీతి జరిగితే కఠిన చర్యలు ఉంటేనే రాష్ట్రంలో మార్పు వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 38 లక్షలమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, మంత్రి గారి ప్రకటనల ప్రకారం వారిలో ఒక్కొక్కరి మీదా రూ. 60వేలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, అయినా చదువు సరిగా రావటం లేదని అన్నారు. అంతకంటే తక్కువ ఫీజు తీసుకుంటున్నా ప్రైవేటు స్కూళ్ల వైపే తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ఎందుకు విశ్వాసం పోయిందో, ప్రైవేటు స్కూళ్లలో అప్పులు చేసైనా ఎందుకు పిల్లల్ని చేరుస్తున్నారో చర్చించాల్సిన రాష్ట్రంలో ఈవేళ ఎలాంటి చర్చ జరుగుతోంది? అని జేపీ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. ప్రజలకు, లక్షలాది బిడ్డలకు పనికొచ్చే విషయాల్ని వదిలేసి, పనికిమాలిన అధికార రాజకీయాల గురించి కుస్తీ పోటీల్లా చర్చిస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమం, ఆ కార్యక్రమం అంటూ ప్రజలను మోసం చేయటం, ప్రలోభాలకు గురిచేయటం తప్ప వారి జీవితాల్ని ఏమైనా బాగుచేస్తున్నాయా? ఎప్పుడైనా సమీక్షించుకుంటున్నాయా? ఇదా 21వ శతాబ్దంలో మనం, మన రాజకీయం, పాలన ఉండాల్సిన తీరు? అని ఆలోచింపచేశారు. ఈ సమస్యలను ప్రజలతో చర్చించి పరిష్కారాలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, స్పందించేలా పోరాడాల్సిన బాధ్యత అందరి మీదా ఉందని జేపీ అన్నారు.




# కులం కంటే బతుకులు ముఖ్యం

ప్రస్తుత ప్రభుత్వాలు సమస్యల పరిష్కారం కంటే, ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని, కానీ పరిష్కారాలు లేకుంటే జనం జీవితాలు ఎప్పటికీ ఎదగవని జేపీ హెచ్చరించారు. పాలకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రజలు ప్రశ్నించకుండా, సంఘటితంగా పోరాడకుండా ఈ పరిస్థితి మారదన్నారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకుని నిర్దిష్టంగా ప్రశ్నిస్తేనే.. పాలకుల ముసుగులు తొలుగుతాయని, రంగులు బైటపడతాయని అన్నారు. ప్రజలు మేలుకోకుండా ఉండటానికి పాలకులు, నేతలు కులాల్ని రెచ్చగొడుతున్నారని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కులం కంటే బతుకులు ముఖ్యమన్నారు. రాజకీయం పేరుతో ప్రజల బతుకులు సమాధి చేస్తుంటే చూస్తూ సహించరాదని, దండుకట్టి ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. కులవివక్ష నుంచి ప్రజలను విముక్తి చేసే ఈ పోరాటంలో లోక్‌సత్తా ముందుంటుందని, పార్టీలకతీతంగా చేస్తున్న సురాజ్య యాత్రలో ఇది కీలక లక్ష్యమని అన్నారు. కులవ్యవస్థను దూరంగా పెట్టినప్పుడే సురాజ్యం వస్తుందన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ తుని, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

---

# కాలువల కన్నా.. చెరువుల్ని అనుసంధానిస్తే బాగుండేది

పుష్కర, పోలవరం కాలువల వల్ల భూములు నష్టపోయామని తూర్పు గోదావరి జిల్లా ఎన్.చామవరం రైతులు జేపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దానికన్నా చెరువులను అనుసంధానం చేసి ఉంటే రైతులకు నష్టం లేకుండానే లాభం జరిగేదన్నారు. సురాజ్య యాత్రలో భాగంగా వచ్చిన జేపీకి తమ సమస్యలను వారు వివరించారు.

జేపీ స్పందిస్తూ, చెరువులను అనుసంధానం చేయటంలో ఏపీ ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని, తక్కువ ఖర్చుతో భూగర్భ జలాలను పెంచేందుకు ఇది మంచి కార్యక్రమమని తెలంగాణలోని 'మిషన్ కాకతీయ'ను ఉటంకిస్తూ అన్నారు. వీలున్నంత తక్కువ ఖర్చుతో పుష్కర కాలువ నుంచి 2వేల ఎకరాలకు నీటి నదుపాయాన్ని అందించడానికి, మామిడిపండ్లను నిల్వ చేయడానికి శీతల గిడ్డంగుల ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

కౌలుదారులకు రుణం ఇవ్వటం లేదని ఈ సందర్భంగా రైతులు అన్నారు. కౌలుదారులైనా, యజమానులైనా.. వ్యవసాయం చేసేవారంతా రైతులేనని జేపీ స్పష్టం చేశారు. రైతులంతా గ్రూపులుగా ఏర్పడితే ప్రభుత్వంతో పోరాటం చేసి రుణాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వాలు రైతుల్ని




బిచ్చగాళ్లుగా చూస్తూ తాత్కాలిక పథకాల్ని తాయిలాల్లా అమలుచేస్తున్నాయని, పండించిన పంటలకు రేటు చుట్టూ వ్యవసాయ విధానాలు తిరిగినప్పుడే రైతుకు ఆదాయం, తలెత్తుకు బతికే జీవితం సాధ్యమవుతాయన్నారు. పాలకులు ఏ పార్టీకి చెందినవారైనా, విద్య, ఆరోగ్యం అందకుండా చేయటం వల్ల, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి వల్ల కూడా రైతులు భారీగా నష్టపోతున్నారన్నారు. రైతుల పట్ల అధికారులు అమానుషంగా వ్యవహరిస్తూ, ప్రతి కాగితానికీ, పంట రుణానికీ లంచాలు గుంజుతున్నారన్నారు. రైతులు ఆర్థికంగా నిలబడ్డప్పుడే, తలెత్తుకుని జీవించినప్పుడే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. ❧

# సమాజం కూడా చదువులో భాగమే




విజ్ఞానం, వివేకం తోడైతేనే విజయాలు సాధ్యమవుతాయని, ఎవరి జీవితాల్లో వారు విజయం సాధిస్తూనే చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా పట్టించుకోవాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా తునిలోని శ్రీప్రకాష్ విద్యాసంస్థలో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ.. ప్రకృతి ప్రతి ఒక్కరికీ తెలివితేటల్ని ఇచ్చిందని, దాన్ని మెరుగుపరిచి మనిషిని సమర్థునిగా తీర్చిదిద్దేది సరైన విద్య మాత్రమేనని జేపీ అన్నారు. ఆధునిక సమాజంలో మంచి విద్య లేకపోతే ఎందుకూ పనికిరారని తెలిసినా, జనాభాలో అత్యధికులు పిల్లలు, యువత అని తెలిసినా ప్రభుత్వాలు విద్యను పట్టించుకోవటం లేదన్నారు. కేవలం చట్టం, న్యాయం సరిగా లేకపోవడం వల్ల చాలామంది బాలికలు చదువుకు దూరమవుతున్నారన్నారు. దేశంలో ప్రస్తుతం 3 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ముంబయి దాడులకు పాల్పడ్డ తీవ్రవాదులకు శిక్షపడేందుకు 24 ఏళ్లు పట్టిందని, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసు తేలటానికి దాదాపు 18 ఏళ్లు పట్టిందని అన్నారు. రాజకీయం, పరిపాలన లక్ష్యమైన ప్రజల ఎదుగుదలలో మనదేశం 103వ ర్యాంకులో ఉందన్నారు. రాజకీయం, పాలన లక్ష్యాన్ని నెరవేర్చటానికి ఏం చేయాలో ఆలోచించకుండా.. ఎలాగోలా ఎలా అధికారంలోకి రావాలి అనే ఒకే ఒక్క అంశం చుట్టూ ఉన్మాద చర్చను పెంచి పోషిస్తున్నారన్నారు. మన పాలకులు రోజూ ఊదరగొట్టే విదేశాల్లో మంచి చదువును, ఆరోగ్యాన్ని ప్రభుత్వాలే అందిస్తాయన్నారు.

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ సమాధానమిచ్చారు. వారి అభిప్రాయాలను ఆసాంతం వింటూ వారి ప్రశ్నలనే పొడిగిస్తూ ఆలోచింప చేశారు.

విద్యార్థులు బట్టీ పట్టటం కాకుండా, ఆహ్లాదకరంగా నేర్చుకుంటూ సొంతంగా ఆలోచించటం, పరిష్కారాలు చూపటం అలవరచుకోవాలని జేపీ అన్నారు. సమాజంలో నెలకొన్న సమస్యలపై అవగాహన కలిగిఉండటం నిజమైన విద్యకు నిదర్శనమన్నారు.





భయం, ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో యువత చదువుకోవాలని, ఎదగాలని, సమాజాన్నీ పట్టించుకోవాలని సూచించారు. నేను, నా కుటుంబం బాగుండాలని కోరుకోవటం అవసరమని, అలాగే మన బాగుకు అవసరమైన రీతిలో సమాజాన్ని కూడా రూపొందించుకోవటం అవసరమని అన్నారు. సమాజం బాగుంటేనే మనం బాగుంటామన్నారు.

సమష్టిగా ప్రశ్నిస్తే విజయం సాధించగలమని జేపీ అన్నారు. విద్యార్థులు, యువత సమాజంలో ఆరోగ్యకరమైన రీతిలో భాగస్వాములై సమష్టిగా పనిచేయటానికే 'యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్' అనే వేదికను అందిస్తున్నామని, ఇందులో నమోదై స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, మాచిరాజు, ఆచార్యులు, హరగోపాల్, నాగంబాబు, రమేష్, వైఎన్‌వీ వరహాలబాబు, విద్యాసంస్థల సహాయ కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపల్ భానుమూర్తి, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జనహితం కోసమే సురాజ్య యాత్ర, పార్టీలకతీతంగా ఆశీర్వదించండి: జేపీ

# మిత్రులతో కలిసి కరపత్రాలు విడుదల




జనం జీవితాల్ని మార్చగలిగిన, ఎప్పుడో జరగవలసిన, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలుచేయగలగిన ఆరు కీలక అంశాలపై నాలుగు ప్రధాన వర్గాలతో పార్టీలకతీతంగా మమేకమవుతూ చర్చించి పరిష్కారాలను సాధించేందుకే 'జనహితం కోసం సురాజ్య యాత్ర'ను ప్రారంభిస్తున్నట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. సెప్టెంబర్ 15, 2017న విశాఖపట్నం నుంచి మొదలయ్యే సురాజ్య యాత్రను తొలుత ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాకు నాలుగైదు రోజులు, ఒక్కో రోజున ఒక్కో వర్గంతో చర్చలు సాగిస్తూ ఏపీలోని 13 జిల్లాల్లో, ఆ తర్వాత తెలంగాణలోని 31 జిల్లాల్లో పర్యటిస్తానన్నారు.

**సురాజ్య యాత్ర లక్ష్యాల గురించి, సురాజ్య యాత్రలో ప్రజల ముందుంచనున్న ఆరు అంశాలకు సంబంధించి సమగ్రంగా రూపొందించిన కరపత్రాలను, రెండు దశాబ్దాలుగా లోక్‌సత్తా వివిధ రూపాలలో కృషి ద్వారా సాధించిన 100 విజయాల పుస్తకాన్ని ఉద్యమ నేతలతో కలిసి హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జయప్రకాష్ నారాయణ్ విడుదల చేశారు. ముమ్ముందు కూడా యువత, ఇతర వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేందుకు రూపొందించిన రెండు వెబ్ ప్లాట్‌ఫారాల** (www.youthforbetterindia.com, www.citizensforbetterindia.com) **ను ఆవిష్కరించారు.**

జేపీ మాట్లాడుతూ, గత 21 ఏళ్లలో బహుముఖ కృషి చేస్తూ ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా 16, 17 రాజ్యాంగ సవరణలు, చట్ట, విధానపరమైన మార్పుల్ని లోక్‌సత్తా సాధించిందని, ఇప్పుడు లోక్‌సత్తా మలిదశ ఉద్యమంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటూ నిర్దిష్ట అంశాలలో ఆచరణసాధ్యమైన పరిష్కారాల కోసం సురాజ్య యాత్రను చేపడుతోందని తెలిపారు.

**జనహితం కోసం జేపీ సురాజ్య యాత్ర ఆరు లక్ష్యాలు :**

**1) ప్రభుత్వ కార్యాలయాల్లో పక్కాగా పౌరసేవలు అందటం:** ప్రభుత్వోద్యోగులకు పే కమిషన్ సిఫార్సు ద్వారా లక్షల కోట్ల మేర జీతాల్ని పెంచి, డీఏలిస్తున్న మోదీ ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు.. ఆ జీతాలకకోసం పన్నులు కడుతున్న ప్రజలకు మాత్రం తగిన సేవలు అందేందుకు ఏర్పాట్లు చేయటం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీ పనుల కోసం వెళ్లే ప్రజలకు లంచాలు, దేబిరింపులు తప్పటం లేదు. ఏ కాస్త చెప్పుకోదగిన దేశంలో కూడా ప్రభుత్వ సేవలు ఇంత అధ్వాన్నంగా లేవు. అందుకే నిర్దిష్ట గడువులోగా ప్రజలకు లంచాలు, వేధింపులు లేని సేవలు అందే ఏర్పాటు చేయాలి.

**2) విద్యను బాగుచేయాలి:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోంది. కానీ అలాంటి పాఠశాలల్లో చదువుతున్నవారికి 30-40 రెట్లు మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో నాసిరకం విద్యను పొందుతున్నారు. మరోవైపు గురుకుల పాఠశాలల్లో కంటే కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఖర్చు ఎక్కువ పెడుతున్నారు. ఒక్కో గురుకుల విద్యార్థి మీద ఏటా రూ. 40,000 వరకు ఖర్చు పెడుతుంటే, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థి మీద రూ. 45,000-48,000 ఖర్చు పెడుతున్నారు. ఇలా ఏపీ, తెలంగాణ ఏటా రూ. 31,000 కోట్లు ఖర్చు పెడుతున్నా సరైన చదువులు అందటం లేదు. ప్రైవేటు చదువుల్లోనూ నాణ్యత లేదు. చదువు సరిగా అందకుంటే ఉపాధి ఎలా వస్తుంది? కులం ఎలా పోతుంది?

**3) జేబులో నుంచి ఖర్చు లేకుండా ఆరోగ్యం అందించాలి:** ఈ ఒక్క రంగంలోనే ప్రభుత్వం కొంత అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. బ్రిటన్ జనాభాతో సమానంగా ఏటా మనదేశంలో అనారోగ్యం వల్ల పేదరికంలోకి జారిపోతున్నారు. తెలుగునాట ఆరోగ్యశ్రీ, ఆరోగ్యరక్ష వంటి పథకాలు




ఫలితాలనివ్వడం లేదు. ప్రభుత్వానికి తక్కువ ఖర్చుతో, ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా అందరికీ నాణ్యమైన ఆరోగ్యం అందించాలి.

**4) నేరానికి శిక్ష ఉండాలి:** గౌరీ లంకేష్ కావచ్చు, మరో చోట మరో హత్య కావచ్చు, మహిళలపై వేధింపులు కావచ్చు, చివరికి పేలుళ్ల కేసులు కావచ్చు.. నేరస్తులకు శిక్ష పడుతుందన్న నమ్మకం మన దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో లేదు. రాజకీయాలు, పోలీసులు మిళితమైపోవడం వల్ల నిజాయతీ పోలీసులు కూడా ఒక పరిధి దాటి న్యాయం చేయలేకపోతున్నారు. చట్టబద్ధపాలనకు పక్కా ఏర్పాట్లు చేయాలి.

**5) తమ పనులు చేసుకునే అధికారం జనం చేతుల్లో ఉండాలి:** ప్రతి చిన్న పనికీ మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కోసం చూడకుండా ప్రజలు పరిష్కరించుకునేలా అధికారాన్ని వికేంద్రీకరించాలి. మునిసిపాలిటీలు, పంచాయతీలకు కనీస అధికారాలుండవుగానీ, కార్పొరేటర్, కౌన్సిలర్ పదవులకు కూడా కోట్లు ఖర్చు చేస్తున్నారు. సరైన పాలన అందించలేని అధికార లాలస చుట్టూ తిరుగుతున్న రాజకీయాన్ని అధికార వికేంద్రీకరణ దిశగా మరల్చాలి.

**6) వ్యవసాయంలో ఆదాయం పెంచాలి :** దళితులు, బడుగు బలహీనవర్గాలు సహా జనాభాలో అత్యధికులు ఆధారపడిన వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి.

ఇవి కాకుండా చాలా మార్పులు కావాలిగానీ, వాటి కోసం ఈ మార్పులను ఇంకా ఆపకూడదని, వేగంగా సాధించాలని జేపీ అన్నారు.

**ఈ లక్ష్యాల కోసం జేపీ మమేకమయ్యే నాలుగు వర్గాలు :**

పై మార్పుల సాధన కోసం 'యువత, రైతులు, దగపడ్డ దళితులు, బలహీనవర్గాలు, పేదలు, నిత్యం సతమతమయ్యే మధ్యతరగతి'తో మమేకమవుతూ జేపీ చర్చిస్తారు. పరిష్కారాలను రూపొందించి జనం భాగస్వామ్యంతో సాధించేందుకు పోరాడతారు.

**యువత కోసం 'యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ), ఇతర వర్గాల ప్రజలకోసం సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా' వెబ్ ప్లాట్‌ఫారాల ఆవిష్కరణ**

మన జీవితాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసే సమస్యల పరిష్కారంలో తేలిగ్గా, రోజువారీ జీవితంలో భాగంగా భాగస్వాములయ్యేందుకు యువతకు, ఇతర వర్గాల పౌరులకు youthforbetterindia.com, citizensforbetterindia.com అనే రెండు వెబ్ ఆధారిత ప్లాట్‌ఫారాలను జేపీ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వీటిలో ఎన్‌రోల్ చేసుకుని పెట్రోలు బంకుల్లో అక్రమాలు, ఆహారంలో కల్తీ వంటి సమస్యల పరిష్కారంలో యువత, ప్రజలు భాగస్వాములు కావొచ్చన్నారు. తెలుగువారే కాకుండా దేశంలో ఎవరైనా వీటిలో నమోదు కావచ్చని, వీటిలో ఎవరూ హీరోలుండరని అన్నారు. ఇలా వచ్చే పదేళ్లలో వివిధ రంగాల్లో కనీసం లక్షమంది యువనిష్ణాతుల్ని తయారుచేయాలన్నది తమ ప్రయత్నమని జేపీ తెలిపారు. దేశానికి ఇలాంటి వారే నిజమైన రక్ష అవుతారన్నారు.

జనహితం కోసం సురాజ్య యాత్ర ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకే పరిమితమైనా, ఈ లక్ష్యాలు మాత్రం జాతీయ స్వభావం కలిగినవని, పార్టీలన్నీ అంగీకరించేవని, పెద్దగా ఖర్చు లేకుండానే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం అమలుచేయగలిగినవని జేపీ అన్నారు. సురాజ్య యాత్రకు అన్ని వర్గాల ప్రజలు, సంస్థలు, మీడియా మద్దతిచ్చి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలిచ్చే విరాళాలన్నిటికీ రసీదు, ఆదాయపన్ను మినహాయింపు ఉంటాయని, ప్రతి రూపాయికీ అనేక రెట్లు ఫలితాల్ని సాధించి చూపుతామన్నారు. పెట్రోలు బంకుల ప్రక్షాళన ద్వారా రూ. 2లక్షల కోట్లు, 2 జీ అక్రమ లైసెన్సుల రద్దు ద్వారా రూ. లక్ష కోట్లు ఆదాయాన్ని ఈ దేశానికి అందించామని కొన్ని ఉదాహరణలుగా చెప్పారు.

1996లో లోక్‌సత్తా కృషికి శ్రీకారం చుట్టినప్పుడు ఐదేళ్లలో మార్పు వస్తుందనుకున్నానని, మౌలిక మార్పులకు పునాది వేసి కొన్ని గణనీయ విజయాలను సాధించినా, ఆశించిన ఫలితాల సాధనకు ఇంకో 5–10 ఏళ్లు పడుతుందని భావిస్తున్నానని ఒక ప్రశ్నకు సమాధానంగా జయప్రకాష్ నారాయణ్ చెప్పారు.

**(జనం కోసం జేపీ సురాజ్య యాత్ర కరపత్రాల్లోని అంశాలు తరువాతి పేజీల్లో..)**

# బీసీలు, దళితుల కోసం జేపీ

**'జనం కోసం జేపీ'**
**సురాజ్య యాత్ర కరపత్రం-1**


ఎవరి కడుపున పుట్టావు,

ఏ కుటుంబంలో పుట్టావు,

..వీటిని బట్టే మన సమాజంలో ఇంకా 90శాతం మంది బతుకులు నిర్ణయమై పోతున్నాయి.

..అందుకే తెలివివున్నా, తెగువ ఉన్నా వాటిని వెలికితీసే అవకాశాలు లేక మనదేశంలో బీసీలు, ఎస్సీలు ఇంకా అడుగునే ఉన్నారు.

ఇందుకు పెద్దగా ఉదాహరణలు చెప్పుకోనక్కర్లేదు. టాప్ 10 కాలేజీల్లో, టాప్ 10 కాంట్రాక్టర్లలో, తెలుగు సినిమా హీరోల్లో ఎంతమంది బీసీలు, ఎస్సీలు ఉన్నారో, వ్యవసాయ భూముల్లో, ప్రైవేటు ఉద్యోగాల్లో బీసీలు, దళితుల వాటా ఎంతో చూస్తే చాలు.. తేలిగ్గా అర్థమైపోతుంది.




వైద్యం కోసం అప్పులు పాలవుతున్నవారిలో బీసీలు, ఎస్సీల సంఖ్యే ఎక్కువ కాదా?

కేసుల్లో ఇరుక్కుని జైలుపాలవుతున్నవారిలో, చివరికి ఉరిశిక్ష పడ్డవారిలో కూడా ఎక్కువ బడుగు బలహీనవర్గాలవారే కాదా?

ఆత్మహత్యలకు పాల్పడుతున్న కౌలురైతుల్లోనూ అత్యధికులూ వారే కాదా?

విద్య, వైద్యం, పోలీసు, న్యాయం, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయం.. ఇలా కీలక వ్యవస్థలు నాశనమవుతున్నకొద్దీ ఎక్కువగా నష్టపోయేది బీసీలు, దళితులే.

ఈ వివక్షం, పేదరికం విషవలయాన్ని ఛేదించి, ఎదిగే అవకాశాలను అందుకోవటానికి అవసరమైన మాస్టర్ కీ చదువు. కానీ పాలకులు అది తప్ప అన్నీ హామీలిస్తుంటారు.

బీసీలు, దళితులు ఎక్కువగా చేరే ప్రభుత్వ పాఠశాలల్ని నాశనం చేయటం వల్లే వాళ్లు ఎదిగే అవకాశాలు అంతంతమాత్రంగా తయారయ్యాయి. ఓట్లే గనక లేకపోతే బీసీలు, దళితులకు ఈ మాత్రం అవకాశాల్ని కూడా ఇచ్చేవారు కారు. కొద్దిమంది తమకు నచ్చిన బీసీ, దళిత నాయకులకు పదవులిచ్చి ఓట్లు దండుకునే రాజకీయమే ఇంకా కొనసాగుతుండటం వల్లే కోట్లాది బీసీలు, దళితులు ఇంకా అవకాశాలు లేక మగ్గిపోతున్నారు.

అందుకే...
బీసీ, ఎస్సీలకు మాస్టర్ కీ అయిన విద్య అందాలంటే ఏం చేయాలి?
బీసీలు, దళితులు పేదరికం నుంచి బైటపడి ఆర్థికంగా ఎదగాలంటే ఏం చేయాలి?
బీసీలు, దళితులు రాజకీయంగా సత్తాగల నాయకులుగా ఎదగాలంటే ఏం చేయాలి?

**ఈ అంశాలను పార్టీలకతీతంగా చర్చిద్దాం.. రండి**
**లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్**
**మన సమస్యలు తెలుసుకోవడానికి, మనతో చర్చించడానికి, అందరికీ ఆమోదయోగ్యమైన, వెంటనే అమలు చేయగల పరిష్కారాలు సాధించడానికి, మనతో కలిసి మార్పు కోసం పోరాడడానికి మన దగ్గరకు వస్తున్నారు.**


# రైతులు, కౌలురైతుల కోసం జేపీ

'జనం కోసం జేపీ'
సురాజ్య యాత్ర కరపత్రం-2

సొంత భూమి ఉన్న వారు, కౌలు చేసుకుంటున్న వారూ ఇద్దరూ రైతులే.

అందుకే రైతుకిచ్చే ప్రతి పథకమూ కౌలురైతుకీ అందించాలి.

కానీ కౌలురైతుకి అవకాశాలే రాకుండా చేస్తూ సొంత భూమి ఉన్న రైతునూ కుంగదీస్తున్నాయి ప్రభుత్వాల విధానాలు.




పంటకు న్యాయమైన ధర వస్తే కౌలుదారయినా, సొంతభూమి ఉన్న రైతయినా లాభపడతారు. కానీ సరిగ్గా ధర వచ్చే టైంకి ఎగుమతుల్ని ఆపేసి దిగుమతులంటారు. ధరలు పెరగకుండా కంట్రోల్ చేస్తూ రైతు నోట్లో మట్టికొడతారు.

కులం, పంట, పార్టీ అంటూ చీలికలుపేలికలుగా ఉన్న గ్రామీణ రైతులకు పాపం నోరు లేదు గదా! అందుకే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా మన మీడియాకూ పట్టదు, నాయకులకూ పట్టదు.

పంట పండినా, ఎండినా రైతుకు నష్టం తప్పదు. పంటలను పారబోసుకుని నిరసన తెలిపితే, ఏ ముంబయినో, ఢిల్లీనో ముట్టడిస్తే వెరైటీగా ఉందనో, సెగ తగిలో కాస్త కవరేజీ పెంచుతారు. కానీ రైతు సమస్యలపై మాత్రం చర్చ ఉండదు.

రైతుల పంటలపై వ్యాపారాలు చేసే దళారీలు కార్లు కొంటున్నారుగానీ, రైతులు మాత్రం కన్నీరు పెడుతున్నారు. పంట ఏదైనా నష్టం వస్తే అది రైతుకే, లాభం వస్తే అది దళారీకే.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలుచేస్తాం, వ్యవసాయాన్ని పండగ చేస్తాం వంటి ఎన్నికల హామీలు, రైతే రాజు వంటి నినాదాలు, బిరుదులు ఇంకెంతకాలం? అంగట్లో అన్ని అవకాశాలున్నా వ్యవసాయం ఎందుకు లాభసాటి కావటం లేదు? రైతుకు ఆదాయం ఎందుకు పెరగటం లేదు? సరైన విత్తనాలు, తేలిగ్గా రుణాలు ఎందుకు అందటం లేదు? రైతులకు రుణమాఫీ చేసినా ఆత్మహత్యలు ఎందుకు ఆగటం లేదు?.. ఈ సమస్యలన్నిటికీ ప్రకృతి శాపం కాదు, పాలకుల పాపమే కారణం కాదా?

రైతుల్ని లంచాల పేరుతో పీడించకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల చట్టం తెద్దాం, రైతు కుటుంబాలకు మంచి ఆరోగ్యం, రైతు బిడ్డలకు మంచి చదువు ఉచితంగా అందించైనా రైతుకు కొంత అండగా నిలుద్దామన్న కనికరాన్ని ఒక్క పాలకుడైనా ఎందుకు చూపటం లేదు?

**రండి.. వ్యవసాయాన్ని లాభసాటి చేసుకుంటూ రైతుగా, కౌలురైతుగా తలెత్తుకుని ఎలా బతకాలో చర్చిద్దాం.**

**పార్టీలకతీతంగా మన సమస్యలు తెలుసుకోవడానికి, మనతో చర్చించడానికి, అందరికీ ఆమోదయోగ్యమైన, వెంటనే అమలు చేయగల పరిష్కారాలు సాధించడానికి, మనతో కలిసి మార్పు కోసం పోరాడడానికి లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ మన ఊరికి వస్తున్నారు.**

# మధ్యతరగతి కోసం జేపీ

'జనం కోసం జేపీ'
సురాజ్య యాత్ర కరపత్రం-3




రూపాయి బియ్యం తినలేం.. 50 రూపాయలకి బియ్యం కొనలేం

మునిసిపల్ నీళ్లు తాగలేం.. మినరల్ వాటర్ కొనలేం

ఇందిరమ్మ ఇళ్లలో ఉండలేం.. కలల ఇళ్లు కట్టుకోలేం

ప్రభుత్వ బడికి పంపలేం.. కార్పొరేట్ ఫీజు కట్టలేం

ప్రభుత్వాసుపత్రులకు పోలేం.. కార్పొరేట్ బిల్లులు కట్టుకోలేం

సిటీ బస్సుల్లో వెళ్లలేం.. బండికి పెట్రోల్ కొనలేం

అవినీతిని సహించలేం.. కానీ అవినీతిపరులకే ఓట్లేస్తుంటాం

రోడ్లు, డ్రైనేజీ బాగాలేదని గొణుక్కుంటాం.. స్థానిక పాలన గురించి నిలదీయలేం

మహిళల భద్రత గురించి భయపడుతుంటాం.. పోలీసులు, న్యాయం మారాలని డిమాండ్ చేయలేం

కులవివక్ష పోవాలనుకుంటాం.. రిజర్వేషన్లను సహించలేం

ఎందుకంటే.. మనం మిడిల్ క్లాస్..!

సంక్షేమ పథకాల భారాన్ని పన్నుల రూపంలో ప్రభుత్వాలకి చెల్లించేది ఎక్కువగా మనమే.

ప్రభుత్వ ఉద్యోగులకి జీతాలు ఇచ్చేది మన పన్నుల డబ్బుతోనే.

ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి సహా సకల సౌకర్యాలు, విలాసాలూ, విహారాలూ మన ట్యాక్స్ డబ్బుతోనే.

మధ్యతరగతి ఉద్యోగులు, చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమలవారికి ప్రభుత్వం నుంచి పన్నుల బాదుడే తప్ప.. పన్నులకు తగ్గ సేవలు అందడం లేదు.

ఈ పరిస్థితి మారాలంటే, అవినీతిలేకుండా, ఇంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలన రావాలంటే ఏం చేయాలి?

మధ్యతరగతి కష్టాలు తీరాలంటే.. ఎదిగే అవకాశాలు దక్కాలంటే ఏం చెయ్యాలి? ప్రభుత్వ విధానాల్లో ఎలాంటి మార్పులు రావాలి?

**చర్చిద్దాం రండి..**

**లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్**

**పార్టీలకతీతంగా మన సమస్యలు తెలుసుకోవడానికి, మనతో చర్చించడానికి, అందరికీ ఆమోదయోగ్యమైన, వెంటనే అమలు చేయగల పరిష్కారాలు సాధించడానికి, మనతో కలిసి మార్పు కోసం పోరాడడానికి మన దగ్గరకు వస్తున్నారు.** ∅

# నెక్ట్స్ ఏంటి?.. (యూత్ కోసం జేపీ)

**'జనం కోసం జేపీ' సురాజ్య యాత్ర కరపత్రం-4**




ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ, డిప్లొమా.. చదువు ఏదైనా.. మనం ఎదుర్కొనే ప్రశ్న.. నెక్ట్స్ ఏంటి అని..

చదువు అయిపోయాక ఏం చేస్తావ్ అని.. జాబ్ చేస్తాననో, బిజినెస్ చేస్తాననో చెప్పేయటం ఈజీయే

ఈ పోటీ యుగంలో జాబ్ కొట్టటం లేదా సొంతంగా వ్యాపారం చేసి ఎదగటం అంత ఈజీ కాదని మనకి తెలుసు..

ఇప్పుడున్న స్థాయి డిగ్రీలతో 80శాతంమంది యూత్‌కి జాబ్ రావడం.. ముద్రా యోజనలున్నా వ్యాపారంలో మనదైన ముద్ర వేయడం అంత ఈజీ కాదు

నెలకి 10లక్షలమంది నిరుద్యోగులు తయారవుతున్న మనదేశంలో పోటీని తట్టుకుని ఉపాధి పొందడమే సమస్యనుకుంటుంటే.. రోబోలు, కృత్రిమ మేధస్సు, త్రీ డీ ప్రింటింగ్ వంటివి వచ్చేస్తుండడం సంక్షోభాన్ని ఇంకా ఇంకా పెంచుతున్నాయి.

కాబట్టి యూత్‌కు రాబోతున్న ఉపాధి సంక్షోభం మామూలుస్థాయిలోనిది కాదు.

ఇంజినీరింగ్ చదివి ఉపాధి హామీ కూలీలుగానో, చదువుతో ఏమాత్రం సంబంధం లేని పనిలోనో మిగిలిపోతున్న దుస్థితిని చూస్తున్నాం.

ఉద్యోగం లేనివారికి తాత్కాలిక ఉపశమనం కోసం కల్పించిన ఉపాధి హామీని, అలాంటి నిరుద్యోగ భృతి వంటి పథకాల్నే శాశ్వత ఉపాధిగా కొనసాగిస్తారా? లేక మంచి ఆదాయం వచ్చే జాబ్ లేదా వ్యాపారంలోకి ఎలా ప్రవేశించాలో ఆలోచిస్తారా?

మంచి ఉద్యోగం లేదా ఇతర ఉపాధి దొరకాలి అంటే అందుకు యువత నైపుణ్యాల్ని పెంచుకోవాలి, అందుకోసం ప్రభుత్వాల విధానాల్నీ మార్చాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలి.

ఎనర్జీ, ఆదర్శ భావాల్లో నేటి యువత ఏ తరానికీ తీసిపోదు. మీ సత్తాని, ఆదర్శాల్ని గనక సమాజసేవతో ముడిపెట్టి భావోద్రేకాలతో కాకుండా హేతుబద్ధ విధానాలతో మీ చుట్టూ ఉన్న సమస్యలపై పనిచేయటం కూడా నేర్చుకుంటే.. మీ నాయకత్వ లక్షణాల వల్ల ప్రభుత్వాలూ తొందరగా స్పందిస్తాయి, స్థానికంగా కూడా కొత్త అవకాశాలు మీకు అందుబాటులోకి వస్తాయి.

యువతకు ఆదాయం పెరిగే ఉపాధినివ్వాలంటే ప్రభుత్వాలు ఎలాంటి విధానాలను రూపొందించాలి? యువత ప్రభుత్వాలని ఏం డిమాండ్ చేయాలి? సామాజిక, స్థానిక నాయకులుగా ఎలా ఎదగాలి? ప్రభుత్వాల విధానాలను ఎలా ప్రభావితం చేయాలి?

**ఎన్నికల రాజకీయాలకతీతంగా చర్చిద్దాం రండి.**

**లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్**

**పార్టీలకతీతంగా మన సమస్యలు తెలుసుకోవడానికి, మనతో చర్చించడానికి, అందరికీ ఆమోదయోగ్యమైన, వెంటనే అమలు చేయగల పరిష్కారాలు సాధించడానికి, మనతో కలిసి మార్పు కోసం పోరాడడానికి మన ఊరికి వస్తున్నారు.**

# రైతు సమన్వయ కమిటీలు రాచరిక వ్యవస్థే

రైతు సమన్వయ కమిటీల ఏర్పాటు ద్వారా టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో రాచరిక వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులను ఇందుకు పావులుగా ఉపయోగపడుతున్నారన్నారు. రైతు సమన్వయ కమిటీల వల్ల స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమయ్యే ప్రమాదముందన్నారు. అధికారాన్ని వికేంద్రీకరిస్తామని ఎంతో అట్టహాసంగా 'గ్రామజ్యోతి' పథకాన్ని ప్రారంభించినప్పుడు లోక్‌సత్తా కూడా సంబరపడిందని, కానీ అందుకు పూర్తి విరుద్ధ దిశలో కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇప్పుడు ఏకంగా గ్రామీణ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే రీతిలో, మెజారిటీ రైతుల్ని కూలీలుగా తయారుచేసే రీతిలో ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ఆటనియమాలు మారకుండా ఆటగాళ్లు మారితే లాభం లేదన్న లోక్‌సత్తా హెచ్చరికను ఆయన పునరుద్ఘాటించారు.

# అగ్రిగోల్డ్ కుంభకోణంలో ప్రధాన పార్టీల నేతల పాత్ర ఉంది

అగ్రిగోల్డ్ ఆర్థిక కుంభకోణంలో ప్రధాన పార్టీల నేతల పాత్ర ఉందని, అందుకే కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యాచరణకు దూరంగా ఉంటున్నాయని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ అన్నారు. అనంతపురంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాధితుల ప్రజా గర్జన సభలో సీపీఐ, సీపీఎం, ఆంధ్ర మేధావుల సంఘం నేతలతోపాటు ఆయన పాల్గన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే వరకూ పోరాటం సాగిస్తామన్నారు. మూడేళ్లుగా సాగుతున్న అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ఇక తాత్సారం చేయకుండా పరిష్కరించాలన్నారు. జీ గ్రూప్ సంస్థ టేకోవర్ చేసే విషయంలో బాధితులకు ప్రభుత్వమే పూర్తి భరోసా ఇవ్వాలన్నారు. దాదాపు 33రోజుల పాటు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో జరిగిన చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా ఈ సభను ఏర్పాటు చేశారు.

# లోక్‌సత్తాను బలోపేతం చేయాలి

లోక్‌సత్తా లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, సంస్థాగతంగా బలోపేతం చేయాలని పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి సాతులూరి గోవిందరావు విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తాకు ఆదరణ పెరుగుతున్న స్థాయిని బట్టి సమాజంలో మార్పును అంచనావేయవచ్చన్నారు. సూర్యాపేటలోని లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావెళ్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా పల్లేటి రమేష్ కుమార్, అధికార ప్రతినిధిగా బండారు నాగరాజు ఎన్నికయ్యారు. హుజూర్‌నగర్ ఇంఛార్జిగా పిల్లుట్ల లింగయ్యను నియమించారు. సమావేశంలో పూదూరి శ్రీనివాసరావు, వంటెపాక యాదగిరి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, బాణాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ నుంచి రోడ్డు ప్రమాదాలపై చైతన్యం: గ్రేటర్ లోక్‌సత్తా

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాల నిరోధానికి చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్టు లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము తెలిపారు. రోడ్డు ప్రమాదాల మృతుల్లో 18-35 ఏళ్ల వయసువారే ఎక్కువగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో ప్రమాదాలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. రోడ్డు ప్రమాద మరణాల్లో హైదరాబాద్ దేశంలో తొమ్మిదో స్థానంలో ఉందన్నారు. ముందు జాగ్రత్తలతో ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. అక్టోబర్ నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా కళాశాలల్లో విద్యార్థులకు, కాలనీల్లో, కూడళ్లలో ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని అంబర్‌పేటలో మాట్లాడుతూ తెలిపారు. ♔

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

◆ జూన్ 23న వరంగల్‌లో జరిగిన బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ రాష్ట్ర పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తూ సాగించిన ఉపన్యాసం విన్న సామాన్య ప్రజలే కాదు సాక్షాత్తూ బీజేపీ రాష్ట్ర నాయకులు కూడా ముక్కున వేలేసుకున్నారు. "రాజకీయాలు చారిటీ కోసం ఉండవు. సేవ చేయడానికి అనేక ఇతర సంస్థలు ఉంటాయి. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి రాజకీయాలు చేయాలి. రాజకీయాల్లో భావోద్వేగాలకు స్థానం ఉండదు. మనవాడే కదా అని ఆలోచించడం కుదరదు. అలా చేస్తే పని జరగదు. పాలిటిక్స్ హ్యాజ్ టు బీ ఎ కోల్డ్ బ్లడెడ్.." అని రాం మాధవ్ అనడం దురదృష్టకరం. ఆయనలాంటి జాతీయ ప్రధాన కార్యదర్శి మాట్లాడినప్పుడు అది తప్పక ఆ పార్టీ విధానమే అయివుంటుంది. అయితే ఇక్కడ చర్చించవలసిన మరో అంశమేమంటే, రాం మాధవ్ మాటలపై ఎందుకో పౌరసమాజం, మేధావివర్గం, ప్రతి చిన్న విషయాన్ని విశ్లేషించే టీవీ ఛానెళ్లు, తెల్లారేసరికి ఎడిటోరియళ్లు రాసే పత్రికలు సరిగా స్పందించలేదు. రాం మాధవ్ మాటలు కార్పొరేట్ శక్తుల మాటల్లా ఉన్నాయి. కార్పొరేట్ శక్తులకు లాభాపేక్ష మీద దృష్టి ఉంటుందే తప్ప ఒక్క నిముషం కూడా సేవ గురించి ఆలోచించరు. 'అధికారం కోసమే రాజకీయాలు' అనే సూత్రీకరణపై ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

-కర్నె ప్రభాకర్,
తెలంగాణ శాసనమండలి సభ్యులు

◆ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు పేరున్న ఆసుపత్రులు ప్రారంభంలో చిన్నగానే మొదలయ్యాయి. అన్ని ఆసుపత్రులు కూడా 60-70శాతం మేర ఆరోగ్యశ్రీ, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం, ఉద్యోగుల ఆరోగ్య పథకం తదితర ప్రభుత్వ బీమా స్కీములపై ఆధారపడే నడుస్తున్నాయి. ఇటీవలికాలంలో ఆ పథకాల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతోంది. దీంతో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారి అమ్మకాలు, ఒప్పందాలు చేసుకుంటున్నారు.

-డాక్టర్ అనిల్‌కృష్ణ,
మ్యాక్స్‌క్యూర్ ఆస్పత్రి ఎండీ, స్వీడన్ కంపెనీ

◆ భారత ఆర్థిక రికవరీ ఇంకా ఆందోళనకరంగానే ఉంది. వినియోగం, పెట్టుబడుల డిమాండ్ ఇంకా మందకొడిగానే ఉన్నాయి. బ్యాంకుల మొండి బకాయిల సమస్య, కంపెనీల బ్యాలెన్స్‌షీట్ల బలహీనత, వ్యవసాయ రుణమాఫీ వంటి వాటి ద్వారా ద్రవ్య క్రమశిక్షణకు విఘాతం వంటివి ప్రతికూలాంశాలుగా ఉన్నాయి.

-డన్ అండ్ బ్రాడ్ స్ట్రీట్,
అమెరికాకు చెందిన వ్యాపార సేవల కంపెనీ

◆ మదర్ థెరెస్సాను విమర్శించేవాళ్లు కొన్నిసార్లు ఎదురవుతుంటారు. అలాంటివాళ్లందరినీ నేనడిగే ప్రశ్న ఒక్కటే- మనలో ఎంతమంది చేతులు అవసరంలో ఉన్నవారికి నిజంగా సాయం అందించాయి?

-నవీన్ చావ్లా,
మాజీ ఈసీఐ, మదర్ థెరెస్సా పుస్తక రచయిత


(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, సోషల్ మీడియా)



# బాలల భద్రత – భారత భద్రత

బాలలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని, బాలల భద్రతే భారత భద్రతని బాలల హక్కుల ఉద్యమకారుడు, నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ఆయన చేపట్టిన భారత్ యాత్ర తెలుగు రాష్ట్రాలకు చేరుకున్న సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు భద్రత గల దేశాన్ని నిర్మించుకోగలిగితే అన్ని మతాలు, ధర్మాలు, సంస్కృతులను కాపాడుకున్నట్టేనన్నారు. గత ఏడాది బాలలపై లైంగికదాడులకు సంబంధించి 15,000 కేసులు నమోదైతే, అందులో కేవలం 4శాతం నిందితులకు మాత్రమే శిక్షలు పడ్డాయన్నారు. భద్రత కోసం చట్టపరమైన చైతన్యం, నిధులు, సంస్కరణలు కావాలన్నారు.

# ఎన్నికలు .. తర్వాత !




**ఎన్నికల్లో..**

తాత.. కాంగ్రెస్‌కి ఓటు వేశాడు.. ఇందిరమ్మ కోసమట
నాన్న.. టీఆర్ఎస్‌కి వేశాడు.. ఎందుకంటే తెలంగాణ పార్టీ అంట
అమ్మ.. టీడీపీకి ఓటు వేసింది
అక్క.. నాకు ఓటర్ కార్డు లేదురా.. నాకు రాజకీయాలు ఎందుకు అని ఇంట్లో ఉంది
బావ.. సాఫ్ట్‌వేర్ కంపెనీవాడు ఇచ్చిన ఒక్కరోజు సెలవుపై కక్కుర్తిపడి ఇంట్లో నిద్రపోయాడు
తమ్ముడు.. ఎవడో పిలిచి రూ.500 ఇస్తే వాడికి గుద్ది వచ్చాడు
ఇక మిగిలింది నేను.. ఒక్కడినే వెళ్లి లోక్‌సత్తాకి వేసి వచ్చా

**కొద్దిరోజుల క్రితం..**

తాత.. నా పింఛన్ రావడం లేదురా.. ఏదైనా చెయ్యి
నాన్న, అమ్మ.. ఇంకా రాష్ట్రం డెవలప్ అయితలేదురా.. ఇంగా ఆగాలి
అక్క.. జీతం సరిపోతలేదురా అన్ని ఖర్చులు పెరిగాయి
బావ.. రోడ్డు మీద బండి నడిపి నడుము నొప్పి వచ్చింది.. డాక్టర్ దగ్గర పదివేలు అయ్యింది
తమ్ముడు.. అన్నా! ఉద్యోగం లేదు.. ఎవరైనా తెలిస్తే చెప్తావా?
అయ్యలారా.. అమ్మలారా.. ఎన్నిసార్లు చెప్పాలి మీకు? తప్పుడు పనులు చేసేవారికి ఓట్లు వేసి కుయ్యో మొర్రో అంటూ ఐదు సంవత్సరాలు కూర్చుంటే ఏమొస్తుంది? ఇప్పటికైనా నిద్రలేచి లోక్‌సత్తా విధానాల బాట (వీటిని మరింత వివరంగా చెప్పేందుకే ఇప్పుడు జేపీ సురాజ్య యాత్ర) పడతారా? లేక మళ్లీ వచ్చే ఎన్నికల్లో మోసపోతారా?

**('జనం కోసం జేపీ సురాజ్య యాత్ర' తరువాతి షెడ్యూల్)**

అక్టోబర్ 9 –10 : విజయనగరం జిల్లా, అక్టోబర్ 11–14 : శ్రీకాకుళం జిల్లా, అక్టోబర్ 15–17 : పశ్చిమగోదావరి జిల్లా

For details visit : www.youthforbetterindia.com

# ‘జనం కోసం జేపీ’ సురాజ్య యాత్ర క్లిక్‌లు



Posting Date 07-10-2017

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on October 1st 2017

# మీ స్పందనకు సలాం ! జేపీతో కనెక్ట్ అవ్వండి ....

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలో మీ విశేష స్పందనకు సలాం!
మన సమస్యల పరిష్కారం కోసం - "జేపీ వెబ్ ప్లాట్‌ఫారాల" ద్వారా

పార్టీలకతీతంగా చర్చలు, కార్యక్రమాల్లో మున్ముందూ భాగమవుదాం,
'మార్పు'ను సాధించుకుందాం !

మనం కాకపోతే ఇంకెవరు?.... ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

జేపీతో కాంటాక్ట్‌కు... www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta, www.youthforbetterindia.com, www.citizensforbetterindia.com, www.fdrindia.org

## Join SURAJYA YATRA

Support

Youth for Better India



జనం కోసం జేపి
సురాజ్యయాత్ర

www.youthforbetterindia.com

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad